శుక్రవారం
05-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 312
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



మార్క్సిస్టు మహామహోపాధ్యాయుడు కార్ల్‌మార్క్స్ 205వ జయంతి నేడు

ప్రత్యేక వ్యాసం 4లో

అన్నదాత వెన్నులో వణుకు

- రేపు అల్పపీడనం... 8న వాయుగుండం, తుపాన్
- ఇప్పటికే అకాలవర్షాలతో రైతన్న అతలాకుతలం
- తాజాగా ఐఎండీ హెచ్చరికలతో బెంబేలు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: అకాలవర్షాలతో అల్లాడుతున్న అన్నదాతను తుపాను ముప్పు వెంటాడుతోంది. రాబోయే నాలుగురోజుల్లో తూర్పు తీర రాష్ట్రాలకు తుపాను(మోచా) ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో అన్నదాత వెన్నులో వణుకు పుడుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో తుపాను బలపడే అవకాశాలున్నట్లు అంచనా వేసింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరించింది. శనివారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశ ముందని, ఆ తర్వాత 8న తీవ్ర అల్పపీడనంగా కేంద్రీకృతమై 9వ తేదీ నాటికి తుపానుగా బలపడే అవకాశముందని హెచ్చరించింది. ఈ తుపాను ఉత్తర

- మిగతా 2 లో

రెజ్లర్లపై ఢిల్లీ పోలీసుల
దాష్టికం

లాఠీలతో కొట్టారు... దూషించారు

- క్రీడాకారుల ఆగ్రహం
- పతకాలు వెనక్కి ఇచ్చేస్తామని హెచ్చరిక
- న్యాయం చేయాలంటూ డిమాండ్

న్యూఢిల్లీ: ఢిల్లీలోని జంతర్‌మంతర్ రణరంగంగా మారింది. తమకు న్యాయం చేయాలన్న రెజ్లర్ల దీక్ష భగ్నానికి అర్ధరాత్రి జరిగిన ప్రయత్నం ఘర్షణకు తావిచ్చింది. పర్యవసానంగా ఉద్రిక్తత నెలకొంది. వాగ్వాదం, ఘర్షణలో కొందరికి గాయాలయ్యాయి. క్రీడాకారులతో పోలీసుల అనుచిత వ్యవహార శైలిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. భారతీయ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలకు డిమాండ్ చేస్తూ రెజ్లర్లు ఆందోళనకు దిగారు. వారి దీక్షను భగ్నం చేసేందుకు ఢిల్లీ పోలీసులు బుధవారం అర్ధరాత్రి అక్కడకు వెళ్లారు. లాఠీలతో రెచ్చిపోయారు. దీంతో ఘర్షణ జరిగి కొందరికి గాయాలయ్యాయి. మహిళా రెజ్లర్లతో పోలీసుల అనుచిత ప్రవర్తనపై నిరసనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తమకొచ్చిన అవార్డులు, పతకాలు వెనక్కి ఇచ్చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇలాంటి అవమానాలు భరించాల్సి వస్తే తమకు ఈ గౌరవాలతో ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మద్దతులో ఇద్దరు రెజ్లర్లపై పోలీసులు దాడి చేసినట్లు ఆరోపించారు. ఘర్షణకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. న్యాయం చేయాలని నిరసన చేస్తున్న తమను అవమానిస్తున్నారని నిరసనకారులు అసహనానికి గురయ్యారు. పోలీసులు తమను దుర్భాషలాడుతూ వేధించారని, దుర్మార్గంగా ప్రవర్తించారని ఆరోపించారు.

వినేశ్ ఫోగట్, బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్ గురువారం విలేకరులతో మాట్లాడారు. వర్షంలో నిద్రిస్తున్న రెజ్లర్లపై కొందరు పోలీసులు లాఠీలతో దాడి చేశారని బజరంగ్ పూనియా తెలిపారు. శిబిరం వద్ద ఒక్క మహిళా పోలీసు కూడా లేరని వినేశ్ ఫోగట్ అన్నారు. 'వారు మమ్మల్ని ఎందుకు తోసేశారు' అని సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్ విలపించారు. ఒక రెజ్లర్ తల పగిలిందన్నారు. మేము మా గౌరవం కోసం పోరాడుతున్నాం కానీ వారు మాతో

- మిగతా 2 లో

జీఓ నం.1 అమలు
మరింత కఠినం

- రోడ్లపై సభలకు చెక్ పెడదాం
- సోషల్ మీడియా వేధింపులపైనా కఠిన చర్యలు
- పోలీస్ అధికారులకు సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: ప్రజలంతా మూకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం జీవో–1 అమలుపై మొండిగానే వ్యవహరిస్తోంది. ఈ జీవోకు సంబంధించి హైకోర్టులో తీర్పు రిజర్వులో ఉంది. దీనిని అవకాశంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం జీవోను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షపార్టీలపై ఉక్కుపాదానికి సమాయత్తమవుతోంది. ఉద్యమాలు, సభలు, సమావేశాల అణచివేతకు యత్నిస్తోంది. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం హోంశాఖపై సమీక్ష నిర్వహించారు. జీవో–1ని కఠినంగా అమలు చేసేందుకు పోలీసులకు స్వేచ్ఛనిచ్చారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు రాష్ట్రానికి ఇదేం ఖర్మ పేరుతో ప్రజల్లోకి వెళు తుండగా, నారా లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఇంకోవైపు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాసమస్యలపై వామపక్షాలు, కార్మిక సంఘాలు నిత్యం ఆందోళనలు చేపడుతున్నాయి. వీటితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రభుత్వం జీవో–1ను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రే పోలీసు ఉన్నతాధికారులకు పూర్తి స్వేచ్ఛనిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సభలకు భారీగా ప్రజలు హాజరైనట్లు చూపడానికి మాత్రమే విపక్షాలు రోడ్లపై కిక్కిరిసేలా చేస్తున్నారని, ఇప్పటికే రెండు సభల వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, ఇక రోడ్లపై సభల వల్ల ప్రజలు చనిపోయే పరిస్థితి రాకూడదని పోలీస్ అధికారులకు సీఎం జగన్ స్పష్టంచేశారు. జీవో–1 పకడ్బందీగా అమలు చేయాల్సిందేనని ఆదేశించారు. మహిళలపై సైబర్ వేధింపుల గురించి సమీక్షించారు. మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో రాజీపడొద్దని సూచించారు. దిశ ద్వారా దేశానికే ఆదర్శంగా నిలిచామని, సైబర్, సోషల్‌మీడియా ద్వారా మహిళలు, చిన్నారులపై

- మిగతా 2 లో

మణిపూర్‌లో
హింస

- కనిపిస్తే కాల్చివేతకు ఆదేశాలు
- రంగంలోకి సైన్యం
- అగ్గి రాజేసిన 'మయితే'లకు ఎస్టీ హోదా

ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మండిపోతోంది. మయితే వర్గాన్ని ఎస్టీల్లో చేర్చే అంశం అగ్గిరాజేసింది. ఈ చర్యలకు వ్యతిరేకంగా నాగా, కుక్కి గిరిజన సంఘాలు ఆందోళలకు దిగడంతో హింస పేట్రేగింది. బుధవారం నుంచి రాజధాని ఇంఫాల్‌లో అనేక హింసాత్మక ఘటనలు చోటుచేసుకు న్నాయి. దీంతో అక్కడి ప్రభుత్వానికి కఠిన నిర్ణయాలు తప్పడంలేదు. కనిపిస్తే కాల్చివేతకు ఆదేశాలను గురువారం జారీచేసింది. 'తీవ్రమైన హింస జరిగినప్పుడు అమలు చేసేందుకు ఈ ఉత్తర్వులు జారీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

శ్రామిక శక్తికి
శరాఘాతం

- నాలుగు నెలల గరిష్ఠ స్థాయికి భారతదేశ నిరుద్యోగిత రేటు
- పెరగని శ్రామికులు... నాణ్యత కొరవడిన ఉద్యోగాలు
- ఇప్పటికే 'ఉపాధి హామీ'కి తగ్గిన నిధుల కేటాయింపు
- పేలవమైన వేతనాలతో అల్లాడుతున్న కార్మికులు

న్యూఢిల్లీ : భారతదేశ శ్రామిక శక్తికి శరాఘాతం ఏర్పడింది. గత దశాబ్ద కాలంలో పాలకుల అస్తవ్యస్త విధానాలు... ముఖ్యంగా కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ వినాశకర ఆర్థిక, రాజకీయ విధానాల ఫలితంగా నేడు దేశంలో నిరుద్యోగం తాండవిస్తోంది. భారతదేశం నిరుద్యోగిత రేటు నాలుగు నెలల గరిష్ఠ స్థాయికి చేరుకుందని తాజా గణాంకాలు వెల్లడించాయి. దేశవ్యాప్త నిరుద్యోగిత రేటు మార్చిలో 7.8 శాతం నుంచి ఏప్రిల్‌లో 8.11 శాతానికి పెరిగింది. పట్టణ నిరుద్యోగ రేటు 8.51 శాతం నుంచి 9.81 శాతానికి చేరింది. ఇది డిసెంబరు నుంచి అత్యధికం. అదే కాలంలో గ్రామీణ ప్రాంతాలలో ఒక నెల క్రితం 7.47 శాతం నుంచి ఏప్రిల్‌లో 7.34 శాతానికి స్వల్పంగా తగ్గిందని సెంటర్ ఫర్ మానటరింగ్ ఇండియన్ ఎకనమీ తాజా గణాంకాలు పేర్కొన్నాయి. నిరుద్యోగిత రేటు మార్చిలో 7.8 శాతం వద్ద మూడు నెలల గరిష్ఠ స్థాయిలో ఉంది. జనవరి, ఫిబ్రవరిలో ఇది 7.45 శాతంగా ఉంది. ఇది డిసెంబరులో 8.3 శాతానికి పెరిగింది. ఇది 16 నెలల్లో అత్యధికం. భారతదేశంలో పెరుగుతున్న జనాభాకు తగినన్ని ఉద్యోగాలను సృష్టించడం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కీలకమైన సవాలుగా మిగిలిపోయింది. ప్రత్యేకించి వచ్చే వేసవిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మూడవసారి పదవిని చేపట్టాలని చూస్తున్న నేపథ్యంలో ఈ తాజా గణాంకాలు కేంద్ర పాలకులకు మింగుపడని విధంగా ఉన్నాయి. 'కార్మికుల భాగస్వామ్య రేటు పెరుగుదల కారణంగా నిరుద్యోగిత రేటు పెరిగింది' అని సీఎంఐఈ ప్రధానాధికారి మహేశ్ వ్యాస్ పేర్కొన్నారు. భారతదేశ శ్రామిక శక్తి గత ఐదేళ్లలో 40 కోట్లకు పైగా స్తబ్దుగా ఉందని ప్రసిద్ధ ఆర్థికవేత్త చెప్పారు. 'ఇది ముఖ్యమైనది, ఎందుకంటే ఇది ఎంత స్థిరంగా ఉందో ఆర్థిక వ్యవస్థ అంతటా విస్తృత ప్రభావాలను కలిగి ఉంటుంది. పెరుగుతున్న పని వయస్సు జనాభాకు సంబంధించి భారతదేశ శ్రామిక శక్తి పెరగడం లేదు' అని మహేష్ వ్యాస్ అన్నారు. సీఎంఐఈ విశ్లేషకులు నటాషా సోమయ్య, ఆర్థిక వేత్త మహేశ్ వ్యాస్ వేర్వేరుగా మాట్లాడుతూ, ఏప్రిల్‌లో నిరుద్యోగిత రేటు పెరగడానికి కార్మిక భాగస్వామ్య రేటు పెరుగుదల కారణంగా ఉంది. ఇది ఉపాధి రేటు పెరుగుదలను కూడా సూచిస్తుందని

- మిగతా 2 లో

వివేకా హత్య కేసులో ప్రధాన నిందితుడు
ఎర్ర గంగిరెడ్డి లొంగుబాటు?

స్విమ్స్ నుంచి ముఖ్య సాక్షి రంగన్న తరలింపుపై ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సాక్షి రంగన్నను హైదరాబాద్‌కు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిసింది. వివేకా హత్యలో రంగన్న కీలక సాక్షిగా ఉన్నారు. ఎర్రగంగిరెడ్డి, ఉమా శంకర్ రెడ్డి, సునీల్ యాదవ్, దస్తగిరి కలిసి వివేకాను హత్య చేశారని 164 స్టేట్‌మెంట్‌లో రంగన్న చెప్పారు. ఈ కేసులో ఏ1 నిందితుడు దస్తగిరి అప్రూవర్‌గా మారిన విషయం తెలిసిందే. అయితే తన ప్రాణాలకు హాని ఉందని దస్తగిరి ఇప్పటికే పదేపదే చెప్పారు. ఇప్పటికే అనుమానాస్పద రీతిలో కల్లూరు గంగాధర రెడ్డి మృతి చెందాడు. రంగన్నను ఆసుపత్రికి తీసుకువచ్చినప్పటి నుంచి వైద్యం పేరుతో ఆయన్ను చంపేస్తారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం రంగన్నకు సీబీఐ అధికారులు 1+1 భద్రత కల్పించారు. అయినప్పటికీ తిరుపతి స్విమ్స్‌లో రంగన్నకు భద్రత లేదని భావిస్తున్న అధికారులు, ఆయన్ను ప్రత్యేక అంబులెన్స్‌లో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారని ప్రచారం జరుగుతోంది. తిరుపతి నుంచి 108 వాహనంలో కడప వరకు తీసుకువెళ్లి అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తారని సమాచారం. రంగన్నకు అందించిన వైద్య వివరాలపై బులిటెన్‌ను స్విమ్స్ ఇంతవరకు విడుదల చేయలేదు. అలాగే రంగన్నను కచ్చితంగా ఏ ఆసుపత్రికి, ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంలోనూ పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. మరోపక్క వివేకా హత్య కేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డి కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం సీబీఐ ఎదుట లొంగిపోవడానికి సిద్ధమైనట్లు తెలిసింది. గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 27న విచారణ జరిపిన కోర్టు... గంగిరెడ్డి బెయిల్ రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. మే 5వ తేదీలోపు సీబీఐ ఎదుట లొంగిపోవాలని ఎర్ర గంగిరెడ్డిని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. లేనిపక్షంలో సీబీఐ... గంగిరెడ్డిని అదుపులోకి తీసుకోవాలని సూచించింది. అలాగే ఈ కేసు దర్యాప్తు పూర్తి చేయడానికి జూన్ 30వ తేదీ వరకు గడువు ఉన్నందున, అప్పటివరకు మాత్రమే ఆయన్ను రిమాండ్‌కు తరలించాలని, ఆ తర్వాత బెయిల్ ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది.

రైతు కన్నీళ్లకు జగనే కారణం: చంద్రబాబు విమర్శ

3లో

8 నుంచి మూడో దశ ఉద్యమం

12 నుంచి 19 వరకు ప్రజాప్రతినిధులను కలుస్తాం

ప్రతి ఉద్యోగి కలిసిరావాలని బొప్పరాజు, పలిశెట్టి పిలుపు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రెండు నెలలుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉద్యోగులు మూడో దశ ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈనెల కూడా ఇప్పటివరకు చాలా మందికి జీతాలు, పెన్షన్ సొమ్ము అకౌంట్లలో జమ కాలేదు. దీంతో ఈనెల 8వ తేదీ నుంచి మూడో దశ ఉద్యమానికి సమాయత్తమవుతున్నామని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోషియేట్ చైర్మన్ టీవీ ఫణిపేర్రాజు, కోశాధికారి వీవీ మురళీకృష్ణనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ స్కీమ్‌లలో, గురుకులాల్లో పనిచేసే ఉద్యోగులకు అయితే మూడు నుండి ఆరు మాసాలుగా జీతాలు లేవు. ప్రభుత్వం బాధ్యతగా చెల్లించాల్సిన జీతాలు/పెన్షన్ సకాలంలో ఇవ్వలేని పరిస్థితి వచ్చినా ఉద్యమం చేయకుండా ఎలా ఉంటామని ప్రశ్నించారు. ప్రతి ఉద్యోగి ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని, అప్పుడే తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమవుతాయన్నారు. ఇప్పటివరకు రెండు దశల ఉద్యమ కార్యాచరణను పూర్తి చేసుకొని...ఈనెల 8 నుండి మూడవ దశ ఆందోళనా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా ఈనెల 12 నుండి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 175 మంది శాసనసభ్యులు, 25 మంది పార్లమెంటు సభ్యులను కలిసి...ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆవేదనను, సమస్యలను వివరిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు మార్చుకొనేలా చూడాలని తమ ఆవేదన వారికి చెపుతామన్నారు. మూడో దశ ఆందోళన కార్యక్రమం జూన్ 8వ

- మిగతా 2 లో

ఐఏఎస్, ఐపీఎస్‌కు
జైలు శిక్ష

- 16లోగా రిజిస్ట్రార్ జ్యుడిషియల్ ఎదుట లొంగిపోవాలని ఆదేశం
- ఉత్తర్వుల అమలు బాధ్యత ఉన్నతాధికారులదేనని స్పష్టీకరణ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: సీనియర్ ఐఏఎస్ కృష్ణ బాబు, ఐపీఎస్ ద్వారకా తిరుమలరావుకు నెల రోజులు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ నెల 16వ తేదీ లోగా రిజిస్ట్రార్

- మిగతా 2 లో

క్రెమ్లిన్‌పై దాడి చేయలేదు

అందుకు కావాల్సిన ఆయుధాలు మా వద్ద లేవు: జెలెన్‌స్కీ

పుతిన్‌ను చంపేందుకు ఉక్రెయిన్ కుట్ర: రష్యా

మాస్కో/కీవ్: రష్యా అధ్యక్షుడి నివాసంపై రెండు డ్రోన్‌లతో దాడిచేసి అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను చంపేందుకు ఉక్రెయిన్ యత్నించిందని రష్యా ఆరోపించింది. రష్యా ఆరోపణలను ఉక్రెయిన్ తోసిపుచ్చింది. ఈ దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేసింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమీర్ జెలెన్‌స్కీ 'ది హేగ్'ను ఆశ్రయించిన క్రమంలో ఈ రెండు దేశాలు పరస్పరం డ్రోన్ల దాడులు జరిగినట్లు ఆరోపణలు చేసుకున్నాయి. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఉన్నతాధికారులతో జెలెన్‌స్కీ ఆకస్మిక భేటీ చర్చనీయాంశంగా మారింది. పుతిన్ పేరిట అరెస్టు వారెంటు కూడా జారీ అయింది. డచ్ నగరంలో జెలెన్‌స్కీ మాట్లాడుతూ నేరపూరిత చర్యలకుగాను పుతిన్‌కు శిక్ష పడాల్సిందేనన్నారు. 'తన చర్యలకు శిక్ష పడిన వ్లాదిమిర్ రూపాన్ని చూడాలని మేమంతా కోరుకుంటున్నాం. మేము గెలిచిన తర్వాత ఇలా తప్పక జరుగుతుంది' అని ఆయన ఉద్ఘాటించారు. పుతిన్‌ను చంపేందుకే క్రెమ్లిన్‌పై ఉక్రెయిన్ డ్రోన్లతో దాడి చేసినట్లు రష్యా ఆరోపించగా దీంతో తమకు సంబంధం లేదని జెలెన్‌స్కీ చెప్పారు. తమ దేశంపై రాత్రి వేళ 24కుపైగా డ్రోన్ దాడులను రష్యా చేసినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం గురువారం వెల్లడించింది. వాటిలో 18 డ్రోన్లను పేల్చివేయగా ప్రాణనష్టం తప్పిందని పేర్కొంది. ఉక్రెయిన్‌కు న్యాయం జరగకుండా శాంతి సాధ్యం కాదన్న వాదనను ఆయన వినిపిస్తున్నారు. ఫిన్లాండ్‌లో ఉన్న ఆయన హెల్సింకీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'మేము పుతిన్‌పై దాడి చేయలేదు. మా భూభాగం కోసం మేము పోరాడుతున్నాం. మా గ్రామాలు, నగరాలను రక్షించుకుంటున్నాం' అని అన్నారు. 'పుతిన్ లేక మాస్కోపై దాడులు చేయలేదు. చేయం కూడా. అందుకోసం మా వద్ద సరిపడ ఆయుధాలు కూడా లేవు' అని అన్నారు. మరోవైపు క్రెమ్లిన్‌పై డ్రోన్ దాడి వీడియో వైరల్‌గా మారింది. 'క్రెమ్లిన్‌పై రెండు డ్రోన్‌లు రాత్రి వేళ దాడి చేశాయి. వాటిని సైన్యం కూల్చివేసింది. దీంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు' అని రష్యా అధికారులు వెల్లడించారు. ఇది ఉక్రెయిన్ చేసిన డ్రోన్ దాడిగా ఆరోపించారు. 'క్రెమ్లిన్ ఆవరణలో డ్రోన్‌ల శకలాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ప్రాణనష్టం, భౌతిక నష్టం జరగలేదు' అని అధ్యక్ష కార్యాలయం ప్రకటించింది. దాడి సమయంలో పుతిన్ క్రెమ్లిన్‌లో లేరని, నోవో ఒగారియోవో నివాసంలో ఉన్నారని ప్రకటన తెలిపింది.

విశాలాంధ్ర ప్రపంచం

టీపీఐకే మా మద్దతు

కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీ సంయుక్త ప్రకటన

టెహ్రాన్: శాంతి, పురోగతి కోసం ఇరాన్ తుదే పార్టీ (టీపీఐ)కి సంపూర్ణ మద్దతిస్తున్నట్లు కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు సంయుక్త ప్రకటనలో తెలిపాయి. టీపీఐ శ్రామికులు, ప్రజల పార్టీ అని పేర్కొన్నాయి. యుద్ధం వల్ల సామ్రాజ్యవాద దేశాలకు లబ్ధి చేరుకుంటుందని టీపీఐ భావిస్తున్నదని ప్రకటన తెలిపింది. టీపీఐకి ఉన్న ప్రజాదరణ, శాంతి, పురోగతి నినాదంతో ప్రత్యామ్నాయంగా ఎదగుతుందని పాలకపక్షం భయపడుతోందని వెల్లడించింది. ఇలాంటి పరిస్థితుల్లో గతంలో టీపీఐ అణచివేతకు అనేక కుట్రలు జరిగినట్లు తెలిపింది. 1979 విప్లవం ద్వారా సాధించుకున్నవేవీ నేడు ఇరాన్‌లో కనిపించడం లేదని, ఆ ఫలాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారాయన్నారు. ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నాశనమైందని, ఇరాన్‌లో నిరంకుశ పరిపాలన కొనసాగుతోందని ప్రకటన పేర్కొంది. శాంతి, ప్రజాస్వామిక హక్కులు, సార్వభౌమత్వం, సామాజిక న్యాయం కోసం ఇరాన్ ప్రజలు చేసే న్యాయబద్ధమైన పోరాటానికి సంపూర్ణ మద్దతిస్తున్నామని కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీలు పేర్కొన్నాయి. ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో సామ్రాజ్యవాద ప్రభుత్వాల జోక్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపాయి. ఇరాన్‌లో భవిష్యత్ రాజకీయ పరిణామాలపై నిర్ణయం ఇరాన్ ప్రజలదే కావాలని, తమ భవిష్యత్ కార్యాచరణను వారే నిర్ణయించుకోవాలని అల్బేనియా, ఆస్ట్రియా, బ్రిటన్, కెనడా, డెన్మార్క్, ఈజిప్టు, ఫిన్లాండ్, జర్మనీ, గ్రీస్, భారత్, ఇరాక్, కుర్దిస్తాన్, ఇజ్రాయిల్, జోర్డాన్, నెథర్లాండ్స్, పాకిస్తాన్, సెర్బియా, స్పెయిన్, కటలోనియా, స్వీడెన్, అమెరికా, వెనిజులా కమ్యూనిస్టు పార్టీలతో పాటు ఆస్ట్రియా, బెహ్రెయిన్, క్రోయేషియా, స్పెయిన్ వర్కర్ల పార్టీలు, ఇరాన్ తుదే పార్టీ పేర్కొన్నాయి.

బ్రెజిల్ మాజీ అధ్యక్షుడి ఇంట్లో సోదాలు

బ్రసీలియా: కోవిడ్-19 నకిలీ వాక్సిన్ కార్డుల జారీ వ్యవహారంలో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సనారో నివాసాన్ని ఫెడరల్ పోలీసులు సోదా చేశారు. ఆయన అనుచరులు, నమ్మకస్తుల ఆస్తులనూ తనిఖీ చేశారు. బోల్సనారో సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కోవిడ్ టీకా తీసుకోబోనని ప్రతిజ్ఞ చేసిన బోల్సనారో వాక్సిన్ తీసుకున్నట్లు ఫిబ్రవరిలో బహిర్గతం చేసిన రికార్డుల్లో ఉండటాన్ని దర్యాప్తు అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. బోల్సనారో వాక్సిన్ రికార్డుల టాంపరింగ్ జరిగినట్లు పోలీసులకు ఆధారాలు లభించడాన్ని సుప్రీంకోర్టు పత్రాలు సూచించాయి. బోల్సనారో గత డిసెంబరులో అమెరికాకు వెళ్లే ముందు ఈ అవకతవకలు జరిగాయని తెలుస్తోంది. అయితే తన ఇంటిలో సోదాలను బోల్సనారో ధ్రువీకరించారు. ఆయన బ్రసీలియాలో విలేకరులతో మాట్లాడుతూ కోవిడ్ వాక్సిన్ తీసుకోలేదని పునరుద్ఘాటించారు.

కోవిడ్ టీకాకు సంబంధించి నకిలీ పత్రాల జారీతో ఎలాంటి సంబంధం లేదన్నారు. 'నేను ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదు. నేను వాక్సిన్ తీసుకోలేదు' అని చెప్పారు. తన ఫోన్‌ను పోలీసులు సీజ్ చేశారన్నారు. 'డిజిటల్ మిలీసియాస్' దర్యాప్తు క్రమంలో మంత్రి అలగ్జాండ్రే డే మోరేస్ అధ్వర్యంలో ఆపరేషన్ వెనైర్‌లో భాగంగా బోల్సనారో ఇంటిని సోదా చేసినట్లు ఏజెన్సీయా బ్రెజిల్ పేర్కొంది. 16 తనిఖీ, స్వాధీనాల వారెంట్లు, ఆరు ముందస్తు అరెస్టుల వారెంట్లను బ్రసీలియా, రియోడి జనేరియాలో జారీచేసినట్లు వెల్లడించింది.

రెజ్లర్లపై ఢిల్లీ పోలీసుల దాష్టికం

(మొదటిపేజీ తరువాయి)

నేరస్తుల్లా వ్యవహరిస్తున్నారు. మా పతకాలనే కాదు జీవితాలను. ఇచ్చేస్తాం. మాకు మాత్రం న్యాయం చేయండి' అని వినీశ్ ఫోగట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏడుస్తూనే మీడియాతో మాట్లాడారు. 'ఇలాంటి రోజులు చూడటానికా ఇన్ని పతకాలు గెలిచింది' అని భావోద్వేగానికి లోనయ్యారు. మాజీ రెజ్లర్ రాజ్‌వీర్ మాట్లాడుతూ పరుపులు వర్షానికి తడిచిన కారణంగా మంచాలు తెస్తుంటే పోలీసులు అడ్డుకున్నారు. వినీశ్‌ను మద్యం మత్తులో ఉన్న పోలీసు ధర్మేంద్ర వేధించారు. మాతో గొడవకు దిగారు. బజరంగ్ పూనియా బావమరిది దుశ్యంత్‌తో పాటు రాహుల్‌కు గాయాలయ్యాయి' అని అన్నారు. పూనియా భార్య సంగీతతోనూ పోలీసులు అనుచితంగా ప్రవర్తించారు. కనీసం వైద్యులను శిబిరం వద్దకు రానివ్వలేదని, మహిళా కానిస్టేబుళ్లు కూడా దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. 'ఢిల్లీ పోలీసుల గుండాగిరీ సాగనివ్వం. మాకు మద్దతివ్వమని రైతులకు పిలుపునిస్తాం. ట్రాక్టర్లు, ట్రాలీలతో రమ్మని కోరతాం' అని అన్నారు. ప్రతిదానినీ రాజకీయాలతో ఎందుకు ముడిపెడుతున్నారని బజరంగ్ పూనియా ప్రశ్నించారు. ఇది మహిళల అంశం ఈ పోరాటానికి రాజకీయాలతో ముడిపెట్టి దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రెజ్లర్లకు న్యాయం చేయాలని సర్కార్‌ను కోరారు.

చిన్న గొడవే...: డీసీపీ ప్రణవ్

'ఎమ్మెల్యే సోమనాథ్ భారతి అనుమతి లేకుండా మడత మంచాలతో ధర్నా ప్రాంతానికి చేరుకున్నారు. మేం జోక్యం చేసుకోగా ఆయన మద్దతుదారులు దురుసుగా ప్రవర్తించారు. ట్రక్కులో నుంచి మంచాలను దించేందుకు యత్నించారు. దీంతో చిన్నపాటి గొడవ జరిగింది. మరో ఇద్దరితో పాటు సోమనాథ్ భారతిని నిర్బంధించాం' అని డీసీపీ (న్యూఢిల్లీ) ప్రణవ్ తయాల్ చెప్పారు. రెజ్లర్లపై బలప్రయోగం జరగలేదని, ఘర్షణలో ఐదుగురు పోలీసు సిబ్బంది గాయపడ్డారన్నారు. సరిపడ మహిళా అధికారులు విధుల్లో ఉన్నారని, వైద్య పరీక్షలు నిర్వహిస్తే పోలీసులు మద్యం సేవించలేదని తేలిందని అన్నారు. ఒక నిరసనకారుడికి గాయం కావడంపై స్పందిస్తూ అతను వైద్యుల సలహాకు వ్యతిరేకంగా ఆసుపత్రి నుంచి వెళ్లిపోయారు. పోలీసులకు ఇంకా వాంగ్మూలం ఇవ్వలేదని తెలిపారు. అవాంఛనీయ ఘటనల నివారణకు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు.

ఎమ్మెల్యే సోమనాథ్ భారతి అరెస్ట్-విడుదల

ఆప్ ఎమ్మెల్యే సోమనాథ్ భారతితో పాటు ఎంపీ దీపేంద్ర హుడా, డీసీడబ్ల్యూ చైర్‌పర్సన్ స్వాతి మాలివాల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెజ్లర్లకు మద్దతు ప్రకటించేందుకు వెళ్లిన నేతలను అరెస్టు చేశారు. సోమనాథ్ భారతిని కపాషేరా పోలీసు స్టేషన్‌కు తరలించి కొన్ని గంటల తర్వాత విడుదల చేశారు.

మేం ఊరికే ఎలా ఉంటాం:

'ఇప్పుడే విడుదలయ్యాం. జంతర్ మంతర్ వద్దకు వెళతాం. మన దేశానికి ఎంతో గౌరవాన్ని తెచ్చిన మన సోదరీమణులు, కుమార్తెలు తమ గౌరవం కోసం పది రోజులకుపైగా పోరాడుతుంటే మేం ఇంట్లో ఎలా కూర్చుంటాం?' అని విలేకరులతో మాట్లాడిన నేతలు అన్నారు.

చేయిచేసుకోవడం సిగ్గుచేటు: రాహుల్

మహిళా రెజ్లర్లపై పోలీసులు చేయిచేసుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. దేశ కుమార్తెలపై దురగతాలు, దాడులకు బీజేపీ ఎన్నడూ వెనుకాడదని ఆరోపించారు. 'బేటీ బచావో' కేవలం మాటలకే పరిమితమని, దేశ క్రీడాకారులతో ఇటువంటి ప్రవర్తన సిగ్గుచేటని హిందీలో ట్వీట్ చేశారు. క్రీడాకారులను పోలీసులు కొడుతున్న వీడియోను ట్విట్టర్‌లో పంచుకున్నారు.

డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిని తొలగించాల్సిందే: కాంగ్రెస్ డిమాండ్

తాజా పరిణామాల క్రమంలో డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ గురువారం డిమాండ్ చేసింది. రెజ్లర్లు కన్నీరు పెట్టుకున్న వీడియోను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ట్విట్టర్‌లో ట్యాగ్ చేశారు. మహిళా క్రీడాకారులు విలపించడం బాధాకరమని పేర్కొన్నారు. వారి వాణి వినాలని, వారికి న్యాయం చేయాలని ప్రధాని మోదీని ఆమె డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత పవన్ ఖేరా స్పందిస్తూ 'జంతర్ మంతర్ వద్దకు వెళ్లి నిరసనకారులతో మాట్లాడేందుకు 15 నిమిషాలు పడుతుంది. ఆ మాత్రం చిత్తశుద్ధి మీకు లేకపోవడం బాధాకరం మోదీజీ. దేశ కుమార్తెలను భారత ప్రభుత్వం మోసం చేసిందని ప్రపంచం చెప్పుకునేలా చేయొద్దు' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనటే స్పందిస్తూ, 'అమిత్ షా ఆడించే ఢిల్లీ పోలీసులు జంతర్ మంతర్ వద్ద అనూహ్యంగా ప్రవర్తించారు. మోదీజీ మీరు ఏ ముఖంతో కర్నాటకకు వెళ్లి మహిళాశక్తి గురించి మాట్లాడతారు? రెజ్లర్లు మీ నుంచి న్యాయాన్ని ఆశిస్తున్నారు. మీకు మనస్సాక్షి, నైతికత లేవా? మోదీ లేక అమిత్‌షా చెబితే రాజీనామా చేస్తానని బ్రిజ్‌భూషణ్ చెప్పిన తర్వాత కూడా ఆయన పదవిలో ఎందుకు ఉన్నారు? మోదీకి దేశ ఆడబిడ్డల గోడు పట్టదా? 2021లోనే ఆయనకు మొదటి ఫిర్యాదు అందిందని వినీశ్‌ఫోగట్ చెప్పారు. చర్యలు తీసుకోవడానికి మీకు ముహూర్తం కావాలా? అంటూ ట్విట్టర్‌లో ఆగ్రహం వ్యక్తంచేశారు.

అది అహంకారమే: కేజ్రీవాల్

అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న రెజ్లర్లతో పోలీసులు ఘర్షణకు దిగడం క్రీడాకారులకు అవమానకరమని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. అహంకారంతోనే ఇలాంటి చర్యలకు బీజేపీ పాల్పడుతోందని, దౌర్జన్యంతో వ్యవస్థను నడపాలని చూస్తోందని ఆరోపించారు. ఆ పార్టీని అధికారానికి దూరం చేయాలని పిలుపునిచ్చారు.

పోలీసుల తీరు ఆక్షేపణీయం : మాలివాల్

రెజ్లర్లకు ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మాలివాల్ మద్దతు ప్రకటించారు. మహిళా క్రీడాకారిణులతో పోలీసుల అసభ్యకర ప్రవర్తన ఆక్షేపణీయమని, ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

సుప్రీంలో ముగిసిన రెజ్లర్ల కేసు విచారణ

తమను బ్రిజ్‌భూషణ్ లైంగికంగా వేధించినట్లు ముగ్గురు మహిళా రెజ్లర్లు చేసిన ఫిర్యాదుపై విచారణను సుప్రీంకోర్టు గురువారం ముగించింది. హైకోర్టు న్యాయమూర్తి లేక రిటైర్డ్ జడ్జి పర్యవేక్షణలో విచారణ జరిపించాలని రెజ్లర్ల తరపు న్యాయవాది కోరగా మౌఖిక ఫిర్యాదు పరిశీలనకు కోర్టు నిరాకరించింది. 'ఎఫ్ఐఆర్ నమోదు, ఫిర్యాదుదారులకు రక్షణ కోసం వచ్చారు. వాటిని పరిష్కరించాం. మీకు ఇంకా సమస్యలు ఉంటే స్థానిక మెజిస్ట్రేట్‌లు లేక హైకోర్టును ఆశ్రయించండి' అని సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జేబీ పార్దివాలా ధర్మాసనం పేర్కొంది. ఈ కేసు విచారణను ముగిస్తున్నట్లు తెలిపింది. ఏప్రిల్ 28న న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఫిర్యాదిదారులకు రక్షణ కల్పించాలని పోలీసులకు ఆదేశాలిచ్చినట్లు ఢిల్లీ పోలీసుల తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. సముచిత భద్రతా ఏర్పాట్లు జరిగాయని, ఆరుగురు మహిళా రెజ్లర్ల కోసం తగు విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మైనర్‌తో పాటు నలుగురు పిటిషనర్ల వాంగ్మూలాలను సీఆర్పీసీలోని 161 సెక్షన్ కింద రికార్డు చేసినట్లు వెల్లడించారు.

మరింత కఠినం

(మొదటిపేజీ తరువాయి)

వేధింపులకు అడ్డుకట్ట పడాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని, ఎస్ఈబీ తరహాలో ఈ విభాగం కూడా ప్రత్యేకంగా నడవాలన్నారు. ప్రతి నేరానికి మూలాలు సోషల్‌మీడియాలో కనిపిస్తున్న సందర్భాలున్నాయని, వాటిని అక్కడే గుర్తించి తుంచగలిగితే...చాలామందిని కాపాడినట్టు అవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వ్యాపారం సైతం సోషల్‌మీడియా ద్వారానే జరుగుతోందని, ఈ విభాగానికి అధిపతిగా అదనపు డీజీ స్థాయి అధికారిని నియమించాలని ఆదేశించారు. దిశ యాప్ పైనా సీఎం సమీక్షించారు. ఈ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకున్నారా? లేదా? అన్నదానిపై మరోసారి పరిశీలన చేయాలని, ఈ యాప్ వినియోగంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. దిశ యాప్ వల్ల జరిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రతి ఇంటికీ కరపత్రం ఇవ్వాలని, ఇప్పటివరకూ దిశ కార్యక్రమం నడిచిన తీరు, ఎంతమంది సహాయం పొందారు, ఎంతమందిపై కేసులు పెట్టారు, ఎంతమందికి శిక్ష పడిందన్న వివరాలు ఈ పేపర్‌లో పొందుపరచాలని, రాష్ట్రంలో కోటి యాభై లక్షలమంది ఇళ్లకు ఈ పేపర్ చేరాలని సీఎం నిర్దేశించారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలోనూ ఒక దిశ పోలీస్‌స్టేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, గంజాయి, డ్రగ్స్ నివారణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. మే 9న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సిద్ధం కావాలని సీఎం ఆదేశించారు. హోం మంత్రి తానేటి వనిత, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

శ్రామిక శక్తికి శరాఘాతం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. అయినప్పటికీ, భారతదేశంలో ఉద్యోగాలు తక్కువగా ఉన్నాయని, నిరుద్యోగులు అత్యధిక సంఖ్యలో ఉన్నారని అన్నారు. 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిలో 40 శాతం మంది మాత్రమే తమను తాము పని కోసం అందిస్తున్నారని చెప్పారు. అందువల్ల ఈ 40 శాతం మంది మీద ఆధారపడిన వారు మరో 60 శాతం ఉన్నారు. పని చేయడానికి సిద్ధంగా ఉన్నవారు. ఉపాధి కోసం చురుకుగా వెతుకుతున్న వారిని నిరుద్యోగులుగా నిర్వచించడం ద్వారా గణిస్తారు. 'నిరుద్యోగ రేటు అనేది నిరుద్యోగులుగా ఉన్న శ్రామిక శక్తి నిష్పత్తి. ఇక్కడ శ్రామిక శక్తి అనేది ఉద్యోగి, నిరుద్యోగుల మొత్తం' అని మహేశ్ వ్యాస్ అన్నారు. దేశంలో నాణ్యత కలిగిన ఉద్యోగాలు తక్కువ అని అన్నారు. చాలా ఉద్యోగాలలో అత్యంత పేలవమైన వేతనాలు ఉన్నాయని, అసంఘటిత రంగంలో అనధికార ఏర్పాట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. గ్రామీణ శ్రామిక శక్తిలో చేరిన వారిలో దాదాపు 94.6 శాతం మంది ఉపాధి పొందారు. అయితే పట్టణ ప్రాంతాల్లో 54.8 శాతం మంది మాత్రమే కొత్త ఉద్యోగాలను కనుగొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉపాధి హామీ కార్యక్రమానికి డిమాండ్ తగ్గుతోందన్న వాస్తవాన్ని సీఎంఐఈ కనుగొన్నది.

అసంఘటిత రంగంలో పేలవమైన వేతనాలు

మే 2022లో ఆర్థిక వేత్త అజితవ రాయ్‌చౌదరి అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) ని ఉటంకిస్తూ 'మంచి' ఉద్యోగాలు చేస్తున్న వారిని మాత్రమే ఉద్యోగిగా గుర్తించాలని చెప్పారు. జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రం ప్రొఫెసర్ ఒకరు పీటీఐతో మాట్లాడుతూ 'మర్యాదపూర్వకమైన పని అనేది వారి పని జీవితంలో ప్రజల ఆకాంక్షలను సంగ్రహిస్తుంది' అని అన్నారు. మంచి ఉద్యోగాలకు ఐఎల్‌వో ప్రమాణాలను వర్తింపజేస్తే భారతదేశంలో నిరుద్యోగిత రేటు చాలా అత్యధికంగా ఉంటుందని చెప్పారు. భారతదేశంలో 80 శాతం కంటే ఎక్కువ మంది శ్రామిక శక్తి అనధికారిక రంగంలో నిమగ్నమై ఉంది. ఇది భారత ఆర్థిక వ్యవస్థలో మూడు ప్రధాన నిర్మాణాత్మక మార్పుల ప్రతికూల ప్రభావాలయిన నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను, కోవిడ్-19 ప్రేరిత లాక్‌డౌన్‌ను చవిచూసింది. నగదు ఎక్కువగా ఉండే అసంఘటిత రంగానికి సంబంధించి, ప్రణాళిక లేని నోట్ల రద్దు కారణంగా 2017 జనవరి నుంచి ఏప్రిల్ మధ్య కనీసం 95 లక్షల ఉద్యోగాలు కోల్పోయారని ఒక ఆంగ్ల వార్తా సంస్థ నివేదించింది. ఇది ఉపాధి రేటులో తగ్గుదలకు దారితీసింది. దీని తర్వాత కార్మిక శక్తి భాగస్వామ్య రేటు బాగా పడిపోయిందని ఐక్యరాజ్యసమితి ప్రపంచ జనాభా దృక్కోణం 2019 నుంచి అంచనాలను ఉటంకిస్తూ నివేదిక పేర్కొంది.

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఏదీ?

ప్రభుత్వ రంగాల్లో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నా వాటిని భర్తీ చేయడం లేదు. ఉదాహరణకు, డిసెంబరు 1, 2022 నాటికి రైల్వేలో 3.12 లక్షల ఖాళీలు ఉన్నాయి. వాటిని భర్తీ చేయడం లేదు. దీంతో చాలా మందికి అధిక సమయం పని చేయాల్సి వస్తోంది. ఇది రైళ్ల పని తీరు, ట్రాక్‌ల నిర్వహణపై కూడా ప్రభావం చూపుతుందని మరొక వార్తా సంస్థ నివేదించింది. గత ఏడాది కూడా రైల్వే ఉద్యోగాలు ఆశించిన వారు నిరసనలు చేపట్టారు. ప్రభుత్వ అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా రక్షణ శాఖలో ఉద్యోగాల ఆశావహులు నిరసన తెలిపారు. ఇది యువతలో ఉద్యోగాల పట్ల ఉన్న నిరాశను స్పష్టంగా తెలియజేస్తోంది. అయితే, ఈ ఏడాది జనవరిలో అధికార బీజేపీ భారతదేశంలో అధికారిక రంగ ఉపాధి పెరుగుతోందని చెప్పడానికి ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) నుంచి నెలవారీ గణాంకాలను ఉదహరించింది. అయితే ఆర్థిక వేత్తల ప్రకారం, ఈపీఎఫ్‌వో నెలవారీ గణాంకాలు లోపభూయిష్టంగా ఉంది. ఇది అధికారిక రంగ ఉపాధిలో కొద్ది భాగాన్ని మాత్రమే స్వాధీనం చేసుకుంటుందని వారు చెప్పారు. ఇదిలాఉండగా, ప్రభుత్వం ప్రజలను ఉద్యోగాలు ఎందుకు కల్పించలేకపోతున్నదని అడిగినప్పుడు, నేరుగా ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం ఆర్థిక సవాలును ఎదుర్కొంటుందని వ్యాస్ అన్నారు. ఆసక్తికరంగా జాతీయ గణాంకాల కౌన్సిల్ మాజీ చైర్మన్ ప్రణబ్ సేన్ ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, 'ఒక దేశంగా మనం దాదాపు 3 శాతం నిరుద్యోగిత రేటుకు అలవాటు పడ్డాము. ఇప్పుడు శాశ్వతంగా 6.5 శాతం-ప్లస్‌కి మారినట్లు కనిపిస్తోంది. ఈరోజు వ్యవసాయం గతంలో కంటే ఎక్కువ మంది ప్రజలను ఆకర్షిస్తోంది. దేశంలోని ఉపాధి శ్రామిక శక్తిలో వ్యవసాయ రంగం వాటా 45.5 శాతంగా ఉంది. అయితే కోవిడ్-19 మహమ్మారి సమయంలో గ్రామీణ కుటుంబ ఆదాయాలు తుడిచిపెట్టుకుపోయాయి. మహమ్మారి సమయంలో గ్రామీణ శ్రామికశక్తికి ఉద్యోగాలు కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజీఎన్ఆర్ఈజీఏ) పథకానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులను తగ్గించింది. ఒక విశ్లేషణలో, నిరుద్యోగులు తమ కొనుగోలు శక్తిని కూడా కోల్పోతారు. ఇది ఇతర కార్మికులకు నిరుద్యోగానికి దారి తీస్తుంది. ఆర్థిక వ్యవస్థను అలలు చేసే ప్రభావాన్ని సృష్టిస్తుంది.

మణిపూర్‌లో హింస

(మొదటిపేజీ తరువాయి)

అయ్యాయి. అన్ని విధాలా ప్రయత్నాలు చేసినప్పటికీ పరిస్థితిని అదుపు చేయలేకపోతే కాల్పులు జరిపేందుకు భద్రతా బలగాలకు ఆదేశాలిచ్చారు. మయితే సామాజిక వర్గం ప్రాబల్య ఎనిమిది జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. తొమ్మిది వేల మందికిపైగా ప్రజలను భద్రతా సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఐదు వేల మందిని చురచంద్రపూర్‌కు, రెండు వేల మందిని ఇంఫాల్ లోయకు, మరో రెండు వేల మందిని తేనుగోపాల్ జిల్లాలోని మొరే సరిహద్దు పట్టణప్రాంతానికి తరలించినట్లు రక్షణశాఖ అధికార ప్రతినిధి తెలిపారు. ఇప్పటికే సైన్యాన్ని రంగంలోకి దింపారు. 55 కంపెనీలతో కూడిన ఆర్మీ, అస్సాం రైఫిల్స్ సిబ్బంది, సీఆర్పీఎఫ్, రాష్ట్ర పోలీసులతో పాటు 500 మంది రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్), రయట్ కంట్రోల్ పోలీసు బలగాలనూ మోహరించారు. మరో 14బృందాలను సిద్ధంగా ఉంచారు. సైన్యం, అస్సాం రైఫిల్స్ దళాలు ఫ్లాగ్ మార్చ్‌లను చురచాందపూర్, కాక్‌చింగ్ జిల్లాలో నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మణిపూర్ పరిస్థితి గురించి ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్ నుంచి వివరాలను కేంద్రహోంమంత్రి అమిత్‌షా అడిగి తెలుసుకున్నారు. కేంద్రప్రభుత్వం ఈ రాష్ట్ర పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు ఆయన తెలిపారు. హింస చెలరేగి నివాసాలు, దుకాణాలు మంటల్లో దగ్ధమయ్యే దృశ్యాలతో సామాజిక మాధ్యమాలు నిండిపోయాయి.

ఇదే కారణం : షెడ్యూల్ తెగ (ఎస్టీ) హోదా కోసం గిరిజనేతర మయితే వర్గం డిమాండ్‌కు వ్యతిరేకంగా ఆల్ ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ మణిపుర్, తర్బంగా ప్రాంతం(చురాచాంద్‌పూర్ జిల్లా)లో 'గిరిజన సంఘీభావ యాత్ర'లో వేలాది మంది పాల్గొన్నారు. ఎస్టీ హోదా కోసం మయితె వర్గం చేసిన డిమాండ్‌కు లోయ ప్రాంతానికి చెందిన చట్టసభ్యుల మద్దతు లభించింది. ఇది గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఘర్షణకు దారితీసింది. మణిపూర్ జనాభాలో 53 శాతం మంది మయితే వర్గానికి చెందినవారున్నారు. బంగ్లాదేశ్, మైన్మార్ నుంచి అక్రమ వలసదారులతో సమస్యలు ఎదుర్కొంటున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు 40శాతం మంది ఉన్నారు. నిబంధనల ప్రకారం పర్వత ప్రాంతాల్లో నివసించేందుకు మయితె వర్గానికి అనుమతి లేదు. కాగా, రాష్ట్రంలోని రెండో అతిపెద్ద పట్టణమైన చురాచాంద్‌పుర్ ఈ ఘర్షణలకు కేంద్ర బిందువుగా మారింది. ఇక్కడి మయితే వర్గీయులపై సాయుధ మూక దాడి చేయడం, దానిని ప్రతిఘటించడంతో హింస మొదలైందని, అది రాష్ట్రమంతటా వ్యాపించిందని పోలీసులు తెలిపారు. తోర్బంగ్‌లో ఇళ్లు, దుకాణాలు దగ్ధమయ్యాయి.

అవగాహన లోపంతోనే హింస: సీఎం

సామాజిక వర్గాల్లో మనస్పర్థలు, పరస్పర అవగాహన లోపమే హింసకు దారి తీసిందని ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తెలిపారు. సంయమనం పాటించాలని రాష్ట్ర ప్రజలను కోరారు. ఇప్పటికే విలువైన అనేక ప్రాణాలను కోల్పోయామన్నారు. ఆస్తినష్టం భారీగా జరిగిందన్నారు. శాంతి, భద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం అన్ని విధాలుగా యత్నిస్తోందని, పారామిలటరీ దళాలను మోహరించిందని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు కట్టుబడి ఉన్నదన్నారు. రాష్ట్ర పరిస్థితిని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వివరించినట్లు తెలిపారు. త్వరలోనే సాధారణ పరిస్థితులు నెలకొంటాయని సీఎం చెప్పారు. హింసకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర-రాష్ట్ర దళాలకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. మిజోరం సీఎంతో రాష్ట్ర పరిస్థితి గురించి మాట్లాడానన్నారు.

శాంతి నెలకొల్పండి: మిజోరం సీఎం ఫోన్:

మణిపూర్‌లో తాజా పరిణామాలపై మిజోరం ముఖ్యమంత్రి జోరంథంగ ఆందోళన వ్యక్తంచేశారు. మణిపూర్ సీఎం బీరేన్ సింగ్‌కు ఫోన్ చేసి రాష్ట్రంలో వెంటనే శాంతి నెలకొల్పాలని కోరారు. కేంద్ర హోంశాఖ సీనియర్ అధికారులతోనూ మిజోరం సీఎం మాట్లాడారు. మరిన్ని సీఆర్పీఎఫ్ దళాలను మణిపూర్‌కు పంపుతామని వారు తనకు హామీనిచ్చినట్లు ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు. మణిపూర్ పరిస్థితిని నిశితంగా గమనించాలని ఆదేశాలిచ్చారు. జో హోంతలక్ (కుకీస్) వర్గీయుల భద్రతకు తగు చర్యలు తీసుకోవాలని మిజోరం హోంమంత్రి, హోం కమిషన్ కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు.

బీజేపీ పాలనలో రాష్ట్రం దగ్ధం: విపక్షాలు

బీజేపీ పాలనలో ఈశాన్య రాష్ట్రం దగ్ధమవుతోందని విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. అధికారంలోకి వచ్చిన 15నెలల్లోనే మణిపూర్ రాష్ట్రాన్ని దగ్ధమవుతున్నా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకుగానీ ప్రధాని మోదీకిగానీ పట్టడం లేదని, వారు కర్నాటక ఎన్నికల ప్రచారంలో నిమగ్నమై ఉన్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. మణిపూర్ పరిస్థితి కలవరపాటుకు గురిచేస్తోందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తంచేశారు. 'ఇది రాజకీయాలకు సమయం కాదు. రాజకీయాలు, ఎన్నికలు ఎక్కడికి పోవు. సుందర రాష్ట్రం మణిపూర్‌ను రక్షించుకోవడమే ఇప్పుడు ముఖ్యం. ప్రధాని, హోంమంత్రి తక్షణమే మణిపూర్ సమస్యను పరిష్కరించాలి. ఆ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని కోరుతున్నా' అని మమత పేర్కొన్నారు.

8 నుంచి మూడో దశ ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈనెల 8న ఉపాధ్యాయులపై వేధింపులు విడనాడాలని, అక్రమ కేసులు, సస్పెన్షన్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్లకు 'స్పందన'లో వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు.

ఉద్యోగులను ఉద్యమానికి సన్నద్ధం చేసేందుకుగాను ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తామని, మొదటి సదస్సును ఈనెల 9న శ్రీకాకుళంలో, 17న అనంతపురంలో, 27న ఏలూరులో, వచ్చే నెల 8న గుంటూరులో జరుపుతామని తెలిపారు. తమకు రావాల్సిన డీఏ బకాయిలు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపు, సీపీఎస్ రద్దు, కొత్త డీఏలపై స్పష్టత, ఆర్టీసీ, గ్రామసచివాలయం, వీఆర్ఏ, వీఆర్ఓ తదితర ఉద్యోగుల సమస్యలపై లిఖితపూర్వక ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఐఏఎస్, ఐపీఎస్‌కు జైలు శిక్ష

(మొదటిపేజీ తరువాయి)

జ్యుడీషియల్ ముందు లొంగిపోవాలని న్యాయస్థానం ఆదేశించింది. వెంటనే జైలుకు పంపాలని రిజిస్ట్రార్‌కు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర్వుల అమలు బాధ్యత ఉన్నతాధికారులదేనని, ఉత్తర్వుల అమల్లో ఇబ్బందులు ఉంటే కోర్టుకు తెలిపి గడువు పొడిగించాలంటూ అభ్యర్థించాలని పేర్కొంది. వీరితో పాటు మరో ముగ్గురు ఆర్టీసీ అధికారులకు కూడా ఏపీ హైకోర్టు షాకిచ్చింది. కోర్టు ఆదేశాలను అధికారులు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని మండిపడింది. ఆర్టీసీలో ఫీల్డ్‌మెన్‌గా పనిచేస్తున్న చిత్తూరుకు చెందిన బి.సురేంద్ర, మరో ముగ్గురు తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న న్యాయస్థానం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వారి జీతాలకు 7శాతం వడ్డీ కలిపి పిటిషనర్లకు చెల్లించాలని 2022 ఆగస్టులో ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలు అమలుకాకపోవడంతో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. అప్పీల్ పెండింగ్‌లో ఉందంటూ ఆర్టీసీ లాయర్లు వాదించారు. అప్పీల్‌పై డివిజన్ బెంచ్ స్టే విధించలేదని హైకోర్టు గుర్తుచేసింది. అందుకే అధికారులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది.

అన్నదాత వెన్నులో వణుకు

(మొదటిపేజీ తరువాయి)

దిశగా కదులుతూ మరింత తీవ్రమయ్యే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తుపానుగా మారితే దీనికి 'మోచా' అని పేరు పెట్టనున్నారు. దీని ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. విదర్భ నుంచి ఉత్తర తమిళనాడు మీదుగా దక్షిణ కర్నాటక వరకు కొనసాగుతున్న ద్రోణి, దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవరించి ఉన్న ఉపరితల ద్రోణి కారణంగా గత వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. గాలిదుమారంతో కూడిన వర్షాలు కావడంతో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం మామిడి దిగుబడి దశలో ఉండడంతో గాలి దుమారానికి కొమ్మలు, చెట్లు విరిగిపడి, కాయలు రాలి పంట మొత్తం నాశనమైంది. అరటి, మొక్కజొన్న విరిగి పడి పంట నీటపాలైంది. కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. కోతలు పూర్తయిన పొలాల్లో పనలు నీటనాని మొలకలెత్తే పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో మిరప పంటకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. అసలే ఈ ఏడాది తామరపురుగు మిరపతోటలను చావుదెబ్బ తీసింది. దీనికి ఏ పురుగు మందు కొట్టాలో కూడా తెలియక ఎవరు ఏం చెపితే ఆ పురుగు మందును పిచికారి చేసి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. పెట్టుబడులు ఈ సంవత్సరం రెట్టింపయ్యాయి. మరో పక్క దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో పంటకు మంచి డిమాండ్ ఉండడంతో కొంత ఊరట చెందారు. ఈలోపే అకాలవర్షాలు కొంప ముంచాయి.

రైతులను అన్నివిధాలా ఆదుకోవాలి: సీఎం జగన్

వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో సీఎంవో అధికారులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం మరోసారి భేటీ అయ్యారు. ప్రతి జిల్లాలో ఇప్పటికే కంట్రోల్ రూమ్‌లు తెరిచామని, యంత్రాంగం అంతా అందుబాటులో ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పూర్తిగా అండగా నిలవాలని, నష్టపోయిన రైతుల్లో ఏ ఒక్కరికీ పరిహారం అందలేదన్న మాటరాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. రంగుమారిన, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా పంట నష్టం తదితర అంశాలపై ప్రాథమికంగా అందిన వివరాలను సీఎంకు అధికారులు వివరించారు. ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత నష్టపోయిన రైతుల జాబితాలను గ్రామ సచివాలయాల్లో సామాజిక తనిఖీకోసం పెట్టాలని సీఎం సూచించారు. రానున్న రోజుల్లో కూడా వాతావరణ పరిస్థితులపై వివరాలు ఎప్పటికప్పుడు తెప్పించుకుని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పంటకోసిన చోట పనలు తడిసిన ప్రాంతాల్లో ఉప్పు ద్రావణం చల్లడం లాంటి విధానాలను పాటించడంపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నామని, ప్రతి జిల్లాకు కూడా ఒక వ్యవసాయశాస్త్రవేత్తను అందుబాటులో ఉంచామని, ధాన్యం కొనుగోలు కేంద్రాలవద్ద, ఆర్బీకేల వద్ద, రైతుల వద్ద ఉన్న ధాన్యం నిల్వలను భద్రంగా ప్రభుత్వ భవనాలు, గోడౌన్లలోకి పంపిస్తున్నామని అధికారులు వివరించారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్క జొన్న కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

రైతు కన్నీళ్లకు జగనే కారణం

చంద్రబాబు విమర్శ

విశాలాంధ్ర-ఉంగుటూరు/తాడేపల్లిగూడెం రూరల్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని, రైతు కన్నీళ్లకు సీఎం జగనే కారణమని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించడానికి గురువారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంట గ్రామానికి చంద్రబాబు వచ్చారు. ఇక్కడ దెబ్బతిన్న పంటలను చంద్రబాబు, పార్టీ నేతలు పరిశీలించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ రైతుల పట్ల ప్రభుత్వం బాధ్యతగా ఉండాలని, నాడు హుదుద్ తుపాను వస్తే హైదరాబాదు నుంచి నేరుగా తాను విశాఖకు వెళ్లానని, అది కూడా రోడ్డు మార్గాన వెళ్లానని, అదీ తన చిత్తశుద్ధి, పట్టుదల అని వ్యాఖ్యానించారు. సీఎంగా జగన్‌కు ఇప్పుడు ఆ బాధ్యత లేదా? రైతుల దగ్గరకు సీఎం ఎందుకు రాలేదని చంద్రబాబు ప్రశ్నించారు. పౌరసరఫరాల సంస్థను కొత్తగా ఏర్పాటు చేశామా? ఏప్రిల్ మొదటి నుంచే ధాన్యం సేకరణ ఎందుకు చేయలేదని నిలదీశారు. రైతులకు గోనె సంచులు ఇవ్వలేని అసమర్ధ ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. ధాన్యం రవాణాకు లారీలు ఏర్పాటు చేయలేని వైఎస్ ప్రభుత్వానికి రైతులే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సీఎం సిగ్గులేకుండా ఐదేళ్ల క్రితం తాము చేసిన వాటికి మళ్లీ శంకుస్థాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం బాధ్యతగా ఉంటే, కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేరిస్తే ప్రజలు, రైతుల కష్టాలు తగ్గుతాయన్నారు. 60 నుంచి 70 శాతం వరకు ధాన్యం పంట పొలాల్లో ఉందన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. చంద్రబాబు పంట పొలాల్లో దిగి...రెండు గంటలపాటు తడిసిన ధాన్యం పరిశీలించి రైతులు కష్టాలు అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబుకు ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యేలు, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రబాబు వద్ద రైతుల గగ్గోలు

తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో చంద్రబాబు పర్యటించారు. రైతులను పరామర్శించారు. దెబ్బతిన్న పంటను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. చంద్రబాబుతో కొంతమంది రైతులు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల గోనెసంచులు సక్రమంగా అందడం లేదని చెప్పారు. ఆన్‌లైన్ పేరుతో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. రవాణా సదుపాయాలు సక్రమంగా లేవని, తీసుకెళ్లిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవడం లేదని, అధికారులు సైతం పట్టించుకోవడం లేదని చంద్రబాబుకు వివరించారు. చందబాబు మాట్లాడుతూ సన్న, చిన్నకారు, కౌలు రైతులు ఎకరానికి రూ.30 వేల పెట్టుబడితో పంటలు పండించారన్నారు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ధాన్యం వర్షానికి తడిసిందని ఆరోపించారు. తడిచిన, మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వమే కల్లాల్లోనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఇప్పటివరకు తడిచిన ధాన్యంపై ప్రకటన చేయకపోవడం అసమర్ధతకు నిదర్శనమన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కౌలు రైతులను ఆదుకోవడానికి సీఎం జగన్ బటన్ నొక్కాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే రైతుల వద్దకే వెళ్లి పంటలు కొనుగోలుకు చర్యలు తీసుకుంటామన్నారు. అన్నదాతలు ఇబ్బందిపడుతుంటే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రైతు భరోసా కేంద్రాల వల్ల రైతులకు మేలు జరగడం లేదన్నారు. తాను వస్తున్నానని తెలిసి జిల్లా రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి నుంచి వాహనాల్లో ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారని చంద్రబాబు తెలిపారు. ఈ పని ముందే చేసి ఉంటే రైతులు నష్టపోయేవారు కాదన్నారు. చంద్రబాబు వెంట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబీ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొర్రెల శ్రీధర్, జిల్లా అధ్యక్షురాలు తోట సీతామహాలక్ష్మి, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఉండి ఎమ్మెల్యే రామరాజు, మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, బూరుగుపల్లి శేషారావు, నాయకులు బాపిరాజు, శనగన వరలక్ష్మీ రాంబాబు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

రెజ్లర్లపై లాఠీచార్జి సిగ్గుచేటు: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-కడప: భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న మహిళా రెజ్లర్లపై పోలీసులు లాఠీచార్జి చేయడం సిగ్గుచేటన్నారు. ఈశ్వరయ్య గురువారం కడపలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ఓవైపు బేటీ బచావో అంటూ మరోవైపు మహిళలకు రక్షణ కల్పించడంలో చిత్తశుద్ధి చూపించడం లేదన్నారు. మల్లయోధులకే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. బిల్కిస్ బానో దోషుల్ని శిక్షాకాలం పూర్తి కాకుండానే బయటకు తీసుకురావడమే కాకుండా దండలు వేసిమరీ సత్కరించిన ఘనత బీజేపీదని వ్యాఖ్యానించారు. హత్రాస్, ఉన్నావో ఘటనలను ప్రస్తావించారు. బ్రిజ్‌భూషణ్ తమను లైంగికంగా వేధించినట్లు మైనర్‌తో సహా మహిళా రెజ్లర్లు ఫిర్యాదులు చేస్తుంటే ఆయనపై తగు చర్యలు ఎందుకు తీసుకోరని ఈశ్వరయ్య ప్రశ్నించారు. ఈ వ్యహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందా అని నిలదీశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దగ్గర నుంచి అందరూ బ్రిజ్‌భూషణ్‌కు మద్దతిస్తున్నారని, ఈరకంగా మహిళలకు అన్యాయం జరిగినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బీసీసీఐకి అమిత్ షా కొడుకు అధ్యక్షుడిగా ఉండటం గమనించాల్సిన అంశమని అన్నారు. వీరంతా కలిసి మహిళలపై మూకుమ్మడిగా దాడి చేస్తుంటే పోలీసు యంత్రాంగం చోద్యం చూస్తోందని విమర్శించారు. తక్షణమే క్రీడాకారులకు న్యాయం చేయాలని ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.

విజయవాడలో ఏసీబీ సోదాలు

ఇద్దరు అధికారుల అరెస్టు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: విజయవాడలో ఏసీబీ అధికారులు గురువారం వేర్వేరు ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఇద్దరు ప్రభుత్వ అధికారులను అరెస్టు చేశారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన సూపరింటెండెంట్ వాసా నగేష్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. నగేష్ భార్య, కుమారుడు మధ్యవర్తుల సమక్షంలో యూనియన్ బ్యాంక్ లాకర్ తెరిచి అందులోని 177.9గ్రాముల బంగారు అభరణాలు, 1585 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని జ్యూడిషియల్ రిమాండ్ కోసం రాజమండ్రి ఏసీబీ స్పెషల్ జడ్జి కోర్టుకు తరలించారు. అలాగే విజయవాడ పటమట స్టాంప్ రిజిస్ట్రేషన్ల శాఖకు చెందిన సబ్‌రిజిస్ట్రార్ అధికారి అజ్జా రాఘవరావు, అతనితో పాటు డాక్యుమెంట్ లేఖరి, సాధారణ ప్రజల నుంచి లంచాలు వసూలు చేసి ఎస్‌ఆర్‌ఐకు అందజేసిన ప్రైవేట్ వ్యక్తులు మల్లీ సుబ్బారెడ్డి, వెంపటాపు దుర్గాప్రసాద్, తమ్మిరెడ్డి శివ కిరణ్‌లను విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

విజయవాడలో మహిళల వినూత్న నిరసన

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై మోయలేని భారం మోపుతోందని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ మండిపడ్డారు. పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్వర్యంలో గురువారం కొత్తపేట నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద వినూత్నంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డుపై కట్టెల పొయ్యి ఏర్పాటు చేసి డికాషన్ కాచి అందరికీ ఇచ్చి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా దుర్గాంబ మాట్లాడుతూ... కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రూ.400 ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1200లకు చేరిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా వ్యతిరేక పాలనకు గ్యాస్ ధరే నిదర్శనమన్నారు. తాము అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలు తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పిన ప్రధాని... పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నిరంతరం పెంచుతూ ప్రజల సంక్షేమం మరిచి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఆర్థిక విధానాలను మార్పుచేసి ఈ దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో సామాన్య ప్రజలు రెండు పూటలా భోజనం చేయలేని స్థితి నెలకొందన్నారు. కోట్లాది మంది దారిద్ర్యంలో జీవనం కొనసాగిస్తున్నా బీజేపీ ప్రభుత్వం ధరలను తగ్గించే చర్యలు తీసుకోవడం లేదని, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలిండర్‌ను రూ.500 ధరకు ఇవ్వాలని, లేని పక్షంలో గత పాలకులకు పట్టిన గతే బీజేపీకి పడుతుందని హెచ్చరించారు. గ్యాస్ బండను మహిళలు మోస్తూ, గ్యాస్ ధరలు సామాన్యుల పై మోయలేని భారం అంటూ వినూత్నంగా చేసిన నిరసన కార్యక్రమాన్ని స్థానికులు, పాదాచారులు ఆద్యంతం ఆసక్తిగా గమనించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి, నేతలు పి.రాణి, ఇజ్జాడ లక్ష్మి, దుర్గాసి రమణమ్మ, డి.పుష్ప, అండమాని నాగమణి, చింతాడ పార్వతి, ఆర్.అనసూయ, బంక ఝాన్సీలక్ష్మి, తాడిశివలీల, ఉమ రాఘవ, సావిత్రి, సోనీ, ధనలక్ష్మి, రేగాని బుజ్జి, అప్పయమ్మ, పైడమ్మ, నారాయణమ్మ, అనురాధ, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

సీఎం జగన్‌కు టీడీపీ నేత గంటా సవాల్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రుషికొండకు బోడిగుండు తప్ప ఉత్తరాంధ్రకు వైసీపీ ఏం చేసిందో చెప్పాలన్నారు. గురువారం విశాఖ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. చర్చకు రావాలని సీఎం జగన్‌కు సవాల్ విసిరారు. డిఫెన్స్ ఎయిర్ పోర్ట్, సాధారణ ఎయిర్ పోర్టుకు ఉండే తేడా కూడా జగన్‌కు తెలియదన్నారు. జీఎంఆర్ చంద్రబాబుకు బినామీ అని విమర్శలు చేశారని మర్చిపోయారా అని ప్రశ్నించారు.

శంకుస్థాపన చేసిన వాటికే మళ్లీ సీఎం శంకుస్థాపనలు చేశారని విమర్శించారు. అదాని డేటా సెంటర్, భోగాపురం విమానాశ్రయానికి టీడీపీ హయాంలోనే శంకుస్థాపన జరిగిందన్నారు. ప్రతిపక్ష నేతగా జగన్ ఉన్నప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టుపై చేసిన వ్యాఖ్యలను గంటా మీడియా ప్రతినిధులకు వినిపించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు 2,700 ఎకరాలు ఉండాలని చంద్రబాబు భూ సేకరణ చేశారని, ఇప్పుడు 500 ఎకరాలు తీసేసి జగన్ శంకుస్థాపన చేశారన్నారు. అదాని డేటా సెంటర్‌పై జగన్ మీడియా గతంలో ఏం రాసిందో మీడియా ముందు ప్రదర్శించారు. జగన్ కే కాదు, ఆయన కేబినెట్ మంత్రులకూ అవగాహన లేదన్నారు.

కేసులకు భయపడేది లేదు

ఆదిరెడ్డి కుటుంబాన్ని కావాలనే వేధిస్తున్నారని గంటా ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మార్గదర్శి, ఆదిరెడ్డి కుటుంబానికి చెందిన చిట్ ఫండ్‌లే ఉన్నాయా? మిగిలిన వాటి జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. టీడీపీ నేతలపై జగన్ సర్కార్ అక్రమ కేసులు పెడుతోందని, సిట్ వేసినా భయపడేది లేదని స్పష్టం చేశారు. వైసీపీకి కౌంట్ డౌన్ ఆరంభమైందన్నారు. రజనీకాంత్‌పై పిచ్చి కుక్కలు మాట్లాడుతున్నాయని, జగన్ కంట్రోల్ చేయాలని హితవు పలికారు. దేశంలో గంజాయి ఎక్కడ దొరికినా వాటి మూలాలు ఏపీలో దొరుకుతున్నాయన్నారు. ప్రజావేదిక కూల్చి తన పాలన ఎలా ఉంటుందో జగన్ ముందే చెప్పారని, ఊసరవెల్లి కూడా జగన్ లా రంగులు మార్చలేదన్నారు. పెట్టుబడుల సదస్సు జరిగి రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు రివ్యూ కూడ నిర్వహించలేని పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం జగన్ సైకోలా తయారయ్యారని, హెలికాప్టర్ లో వెళ్లే సీఎం కోసం 100 కిలోమీటర్ల రూట్ బ్లాక్ చేశారన్నారు. రెండు రోజులపాటు దుకాణాలు మూసేయడం దారుణం అని దుయ్యబట్టారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవిరావు మాట్లాడుతూ... జగన్ ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చారని, రాష్ట్రంలో నిరుద్యోగులకు నో చాన్స్ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఉద్యోగావకాశాలు లేక యువత ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారని, ప్రస్తుత ప్రభుత్వ వేధింపుల వల్ల పరిశ్రమలు తరలిపోతున్నాయని చెప్పారు. దీని వల్ల కూడా నిరుద్యోగ సమస్య బాగా పెరిగిందన్నారు. దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గండి బాబ్జి మాట్లాడుతూ వైజాగ్ వచ్చి కాపురం పెడతానని సీఎం జగన్ రెడ్డి పదేపదే చెబుతున్నారని, మరి ఆయన కాపురం పెట్టడం వలన ఇక్కడ ఒరిగేది ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ చిక్కాల విజయబాబు, భీమిలి ఇంచార్జ్ కోరాడ రాజబాబు, జోన్ 1 మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతన్న రెడ్డి, పార్టీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య చికిత్స

మంత్రి విడదల రజిని ఆదేశం

విశాలాంధ్ర - నంద్యాల: ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని ఆస్పత్రి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం నంద్యాల జిల్లా కేంద్రంలోని సర్వజన వైద్యశాలలోని వార్డులను కలియతిరిగి రోగులను ఆత్మీయంగా పలకరిస్తూ క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్, ఏపీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓపి విభాగం మొదలుకొని అన్ని వార్డులు కలియతిరిగి రోగులను ఆత్మీయంగా పలకరిస్తూ అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకుని మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు మెరుగైన ఆధునిక వైద్య చికిత్సలు అందించి అవసరమైన మందులను పంపిణీ చేయాలని వైద్యాధికారులకు మంత్రి సూచించారు. ఆసుపత్రిలోని ఓపీ బ్లాక్, ఎంసీహెచ్, ఎస్ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లను, అత్యవసర చికిత్స విభాగాలను సందర్శించారు. అక్కడే వున్న రోగులతో మాట్లాడుతూ ఇక్కడ సేవలు ఎలా వున్నాయని అడిగి తెలుసుకున్నారు. మందులు సకాలంలో అందిస్తున్నారా లేదా అని గర్భిణీలను అడిగారు. ఆసుపత్రిలో వైద్య సేవలు బాగా అందుతున్నాయని రోగులు మంత్రికి నివేదించారు. అనంతరం టెలిమెడిసిన్ విభాగాన్ని సందర్శించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. టెలిమెడిసిన్ కు సంబంధించి జిల్లాలోని ఎక్కడి నుంచైనా ఆరోగ్య సిబ్బంది సర్వజన వైద్యశాలలోని స్పెషలిస్ట్ వైద్య సలహాలు తీసుకొని చికిత్స సేవలు పొందవచ్చని మంత్రికి వివరించారు. ఆస్పత్రి పర్యవేక్షకులు వరప్రసాద్, డిప్యూటీ సూపరింటెండెంట్ మహబూబాషా, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణలత, నర్సింగ్ పర్యవేక్షకులు నాగరాణి, గైనకాలజిస్ట్ స్నిగ్ధ తదితరులు సంబంధిత వార్డుల వివరాలను నివేదించారు.

ఏవోబీ సరిహద్దులో ఘోర ప్రమాదం

- ట్రాక్టర్ బోల్తాపడి నలుగురి మృతి
- ఆరుగురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర బ్యూరో-అల్లూరి జిల్లా: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) లోని మల్కన్‌గిరి జిల్లాలో ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో నలుగురు మృతి చెందగా, ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదంలో ఓ చిన్నారి సైతం ఉన్నట్లు అధికారులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి ట్రాక్టర్‌ను రహదారి పక్కనే ఆపి బయటకు వెళ్లారని, ఈ క్రమంలో ట్రాక్టర్ బోల్తాపడి 30 అడుగులు లోయలో పడిందని ప్రత్యక్షసాక్షులు వెల్లడించారు. బాధితులు చిత్రకొండ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు... ఏవోబీలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్‌లోని కటాఫ్ ఏరియాలోని బడపదర్ పంచాయతీలోని సుమారు 15 మంది గాజులుమామిడి పంచాయతీ తంట్లగుడా గ్రామంలోని ఒకరి అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఖరిమల్ గ్రామ సమీపం వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిని సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ ముగ్గురు మృతి చెందారు. మిగతా క్షతగాత్రులను చిత్రకొండ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వీరిని అధికారులు మల్కన్‌గిరి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. మృతుల్లో ఐదేళ్ల చిన్నారి ఉంది. డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి ట్రాక్టర్‌ను రహదారి పక్కనే ఆపి బయటకు వెళ్లారని, ఈ క్రమంలో ట్రాక్టర్ బోల్తాపడి 30 అడుగులు లోయలో పడిందని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ఘటనపై స్థానిక పోలీసులు స్పందించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపడతామని వెల్లడించారు.

నేడు బుద్ధవనంలో

బుద్ధజయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బుద్ధవనం శుక్రవారం 2567వ బుద్ధ జయంతి ఉత్సవాలకు ముస్తాబైంది. నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో ఈ నెల 5న వైశాఖ పున్నమినాడు 2567వ బుద్ధజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం ప్రదేశం నుంచి భారతీయ బౌద్ధ మహాసభ తెలంగాణా విభాగం, బుద్ధవనం కలిసి 200 కార్లతో ర్యాలీగా ఉదయం 8.00 గంటలకు బుద్ధవనానికి బయలు దేరనున్నారు. రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, క్రీడా, సాంస్కృతిక శాఖ మంత్రి డా॥వి. శ్రీనివాస్ గౌడ్, హోంశాఖ మంత్రి మహమూద్ ఆలీ ర్యాలీని ప్రారంభించనున్నారు. హర్యానా ముఖ్యకార్యదర్శి రాజశేఖర్ ఉండ్రు, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాసయాదవ్, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర పర్యాటక శాఖ, అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్, పర్యాటశాఖ, అధికారులు, బౌద్ధభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారని తెలిపారు. బుద్ధవనంలో ఉదయం బౌద్ధ భిక్షువులచే బుద్ధపాద వనం, ప్రార్థనలతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఇందులో యూజీసీ పూర్వ అధ్యక్షులు సుఖదేవ్ థోరాట్ మెన్‌సేకాంగ్ ధర్మశాల టిబెట్ హెర్బల్ కేంద్రం వారి ఆరోగ్యశిబిరాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. సాయంత్రం జరిగే కార్యక్రమాలలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, స్థానిక ఎమ్మెల్యే నోముల భగత్, వివిధ బౌద్ధ మేధావులు, పాల్గొంటారనీ. బుద్ధవనం ఎంట్రెన్స్ ప్లాజా నుంచి ముఖ్యఅతిథులు, బౌద్ధులు, బౌద్ధభి మానులు ధర్మయాత్రగా బుద్ధుని పాదాలవద్దకు వెళ్లి పాదాభివందనం తారువాత మహాస్థూప సమావేశ మందిరంలో బౌద్ధ తాత్వికత సమాజ జాతీయ సమ్మిళిత భారత ప్రజాస్వామ్యం అనే అంశపై సుఖ్‌దేవ్ థోరాట్ ప్రసంగిస్తారు.

డార్విన్ సిద్ధాంతం తొలగింపు

రాజ్యాంగానికి వ్యతిరేకం

అభ్యుదయ ఫోరం సదస్సులో డాక్టర్ యుగల్ రాయలు

విశాలాంధ్ర-తిరుపతి: దేశ ప్రజలలో శాస్త్రీయ దృక్పోణాన్ని పెంచాలని రాజ్యాంగం చెబుతుంటే కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా మనువాదాన్ని పాఠ్యాంశాలలో చేర్పించి ప్రజలను మూఢత్వంలోకి నెట్టు వేసేందుకు కుట్ర చేస్తోందని వక్తలు వ్యాఖ్యానించారు. ప్రజలు చైతన్యవంతులై ఇటువంటి చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గురువారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో అభ్యుదయ ఫోరం జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రసాద్ అధ్యక్షతన డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాలలో తొలగించడంపై జరిగిన సదస్సులో అఖిలభారత అభ్యుదయ ఫోరం జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ యుగల్ రాయలు మాట్లాడుతూ మానవాభివృద్ధిలో డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం మేలిమలుపు అని అన్నారు. 200 ఏళ్ల క్రితం డార్విన్ ఆరు సంవత్సరాల పాటు నిశితంగా పరిశీలించి జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని గుర్తుచేశారు. శాస్త్ర పరిశోధనలో డార్విన్ సిద్ధాంతం కీలకమన్నారు. 80 లక్షల సంవత్సరాల క్రితం భూమిపై జీవం ఆవిర్భవించిందని డార్విన్ సిద్ధాంతం పేర్కొన్నదన్నారు. ఈ సిద్ధాంతం ఇప్పటితరానికి తెలియకుండా తొలగించాలన్న కేంద్రం చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కాంగో మాట్లాడుతూ దేశంలో ప్రశ్నించేవారు ఉండకూడదని కేంద్రం కుటిల యత్నాలు చేస్తోందని, ప్రజలు చైతన్యవంతులై ఈ చర్యలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ విద్యా విభాగం జాతీయ కన్వీనర్ అనిల్ రాజీమ్‌వాలే, అభ్యుదయ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రమణ, జిల్లా అధ్యక్షులు డాక్టర్ గురవయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

'అమ్మని నాన్న రోజు తంతున్నాడు సారూ'

ఎస్ఐకి తొమ్మిదేళ్ల బాలుడి ఫిర్యాదు



విశాలాంధ్ర-కర్లపాలెం: 'సారు గారండీ మా నాన్న రోజు మందు తాగి వచ్చి అమ్మని తంతునాడు... అమ్మ ఏడుస్తోంది...నేను చూడలేక పోతున్నా... మీరు అమ్మని తన్నకుండా నాన్నకు చెప్పండి సారూ' అంటూ తొమ్మిదేళ్ల బాలుడు ఎస్ఐకి మొరపెట్టుకున్న ఘటన గుంటూరు జిల్లా కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కర్లపాలెం పంచాయతీ పాత ఇస్లాంపేటకు చెందిన సుబానీ... రోజు మద్యం తాగేసి తన భార్య సుబాంబీతో గొడవ పడుతూ కొడుతున్నాడని బాలుడు రహీం తన తండ్రిపై ఎస్ఐ శివయ్యకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. 9 ఏళ్ల బాలుడు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

సంపాదకీయం

నిరసన సహించలేని నియంతృత్వం

భారత మల్లయోధుల సంఘం అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కొందరు మహిళా యోధులను లైంగికంగా వేధించాడని అనేకమంది క్రీడాకారులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఏప్రిల్ 23 నుంచి నిరసన తెలియజేస్తున్నారు. వారి నిరసన సంపూర్ణంగా శాంతియుతంగానే కొనసాగుతోంది. కానీ బుధవారం అర్థ రాత్రి ఢిల్లీ పోలీసులు నిరసన తెలియజేస్తున్న వారి మీద తమ ప్రతాపం చూపించారు. కొందరు క్రీడాకారులకు గాయాలుకూడా అయ్యాయి. ఒక క్రీడాకారిణి స్పృహ తప్పి పడిపోయారు. నిరసన తెలియజేస్తున్న వారి కోసం ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు సోమ్‌నాథ్ భారతి మంచాలు తెప్పించడం పోలీసులకు రుచించలేదు. అనుమతి లేకుండా మంచాలు, పరుపులు తెప్పించకూడదని మాత్రమే తాము నివారించామని పోలీసులు అంటున్నారు. జంతర్ మంతర్ నిరసన తెలియజేయడానికి ఉద్దేశించిన ప్రాంతం. అలాంటప్పుడు నిరసన తెలియజేసే వారు కూర్చుని నిరసన తెలియజేస్తారా, నిలబడి తెలియజేస్తారా అని చర్చించడం వృథా. ఇందులో పోలీసులు అభ్యంతర పెట్టదగింది అంతకన్నా లేదు. పోలీసులు తమను తోసేశారని నిరసన తెలియజేస్తున్న క్రీడాకారులు అంటున్నారు. ఆ మాత్రం బలప్రయోగం చేయడం పోలీసుల సహజ స్వభావం అయిపోయింది. లాఠీ ఎత్తితే తప్ప వారి నోట మాట పెకలని పరిస్థితి ఉంది. అన్నింటికన్నా మించి అధికారంలో ఉన్న వారికి సంతృప్తి కలిగే రీతిలో వ్యవహరించడం పోలీసుల స్వభావంగా మారిపోయింది. రాజకీయ ప్రయోజనాలకు పోలీసు బలగాలను దుర్వినియోగం చేయడం దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉంది. తమ దురుసు ప్రవర్తనను సమర్థించుకోవడానికి పోలీసులు ఎన్ని కథలైనా అల్లగలరు. "ఆం ఆద్మీ పార్టీ శాసనసభ్యుడు సోంనాథ్ భారతి క్రీడాకారులు నిరసన తెలియజేస్తున్న చోటికి కొన్ని మడత మంచాలు తీసుకొచ్చారు. దీనికి అనుమతి లేదు. పోలీసులు అభ్యంతర పెట్టినప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలతో స్వల్ప ఘర్షణ జరిగింది. మరో ఇద్దరితో పాటు సోమ్‌నాథ్ భారతిని అదుపులోకి తీసుకున్నాం" అని ఢిల్లీ పోలీసు డిప్యూటీ కమిషనర్ ప్రణవ్ పాయల్ అంటున్నారు. ఇది పోలీసుల దాష్టీకాన్ని సమర్థించుకోవడానికి పకడ్బందీగా అల్లిన కట్టుకథే. నిరసన తెలియజేస్తున్న వారు గత కొద్ది రోజులుగా జంతర్ మంతర్ లోనే ఉన్నారు. అలాంటప్పుడు వారు విశ్రాంతి తీసుకోవడానికి మంచాలు తెప్పించడం అక్రమం ఎలా అవుతుందో, దానికి అనుమతి అవసరం ఏమిటో అర్థం కాదు. కొంత మంది మల్ల యోధులు వర్షం కురుస్తున్నందువల్ల కొయ్య మంచాలపై పడుకుని ఉన్నప్పుడు పోలీసులు వచ్చి తమను కర్రలతో బాదారని నిరసనకారులకు నాయకత్వం వహిస్తున్న వారిలో ఒకరైన బజరంగ్ పునియా అన్నారు. పోలీసులు తమ మీద దాడి చేసినప్పుడు ఒక్క మహిళా పోలీసు కూడా లేరని ప్రఖ్యాత మల్ల యోధురాలు వినేశ్ ఫొగాట్ కన్నీళ్ల పర్యంతమై చెప్పారు. ఒకరికి తల మీద గాయాలయ్యాయని కూడా ఫొగాట్ అన్నారు. పోలీసులు తమతో దురుసుగా ప్రవర్తించి తమను తోసేశారని కూడా నిరసన తెలియజేస్తున్న వారు ఆరోపించారు.

మరో వేపు పౌరులు తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పునియా విజ్ఞప్తి చేశారు. రైతు ఉద్యమ నాయకుడు రాకేశ్ తికైత్ బుధవారం నిరసన శిబిరాన్ని సందర్శించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు నిరసనకు మద్దతిస్తూనే ఉన్నారు. అనేక మంది రైతులు ట్రాక్టర్లు తీసుకుని జంతర్ మంతర్ రావడానికి ప్రయత్నించినప్పుడు పోలీసులు షరా మామూలుగా వారిని ఢిల్లీ సరిహద్దుల్లోనే ఆపేశారు.రగడ జరగడానికి ముందు ఒక పోలీసు మరుగుదొడ్లోకి వెళ్లి మద్యం సేవించాడని నిరసన ప్రదర్శన చేస్తున్న గోపాల్ తివారీ తెలియజేశారు. ఆ పోలీసుకు వైద్య పరీక్ష చేయించాలని క్రీడాకారులు కోరారు. కానీ పోలీసులు క్రీడాకారులను బెదిరించి మద్యం సేవించాడన్న ఆరోపణ ఉన్న పోలీసును అక్కడినుంచి తీసుకెళ్లి పోయారు. ఆ పోలీసు మద్యం సేవించకపోతే అక్కడి నుంచి తీసుకెళ్లవలసిన అవసరం ఏముంటుంది! గమనించవలసిన విషయం ఏమిటంటే వర్షం వల్ల ఆ ప్రాంతం అంతా బురదగా తయారైనందువల్లే క్రీడాకారులు మంచాలు తెప్పించుకున్నారు. ఇందులో మహాపాచారం ఏముందో అంతుబట్టదు. నిరసనకారులకు, పోలీసులకు మధ్య వాదోపవాదాలు కొనసాగుతుండగానే కొంత మంది పోలీసులు మడత మంచం ఎత్తి రాహుల్ యాదవ్ అనే క్రీడాకారుడి తల మీద బాదారు. కాలితో తన్నారు. కర్రలతో చితగ్గొట్టారు. ఆయనకు తల మీద, కాలికి గాయాలైనాయి. ఇదంతా పోలీసులు దాష్టీకానికి దిగినట్టు నిరూపిస్తూనే ఉంది. ఈ గొడవ గురించి తెలిసిన ఢిల్లీ మహిళా కమిషన్ అధ్యక్షురాలు స్వాతీ మలీవాల్ జంతర్ మంతర్ వస్తే పోలీసులు ఆమెను కూడా నిర్బంధించారు. మరీ విచిత్రం ఏమిటంటే బ్రిజ్ భూషణ్‌శరణ్ మీద తీవ్రమైన ఆరోపణలు వచ్చినా సుప్రీంకోర్టు కలగ జేసుకునే దాకా ఆయన మీద ఎఫ్.ఐ.ఆర్. కూడా దాఖలు చేయలేదు. లైంగిక వేధింపులకు గురైన వారిలో ఒక మైనర్ అమ్మాయి కూడా ఉంది. అలాంటి ఆరోపణ వచ్చినప్పుడు వెంటనే ఆరోపణకు గురైన వ్యక్తిని అరెస్టు చేయాలి. ఇంతవరకు ఆయనను అరెస్టే చేయలేదు. ఆయన బీజేపీ ఎంపీ కావడం, పైగా బాహుబలి కావడం కూడా ఆయనను వెనకేసుకు రావడానికి కారణం అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తాను క్రీడాకారిణులను లైంగికంగా వేధించాననడానికి ఆధారాలు చూపించాలని బ్రిజ్ భూషణ్ సవాలు విసురుతున్నారు. లైంగిక వేధిపులకు పాల్పడే వారు సాక్షులను పక్కన పెట్టుకుని ఆ పని చేయరుగా! కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తే నిజానిజాలు వెల్లడి కావచ్చు. కానీ చట్టం పరిధిలో పని చేయడం మోదీ సర్కారుకు అలవాటు లేని వ్యవహారం. పైగా ఢిల్లీ పోలీసులు కేంద్ర హోం మంత్రి అమిత్ షా అదుపాజ్ఞల్లో పని చేయాలిగా! బ్రిజ్ భూషణ్ మీద అనేక కేసులున్నాయి. ఆరు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారన్న కీర్తీ ఉంది. పైగా బహుబలి అన్న పేరుంది. అలాంటి వ్యక్తిని ఢీకొనడం సామాన్యమైన విషయం కాదు. బ్రిజ్ భూషణ్ ఆగడాలు భరించనలవి గానివిగా తయారైనందువల్లే మహిళా క్రీడాకారులు నిరసనకు దిగాల్సి వచ్చింది. బ్రిజ్ భూషణ్ పై ఎట్టకేలకు ఎఫ్.ఐ.ఆర్. నమోదైనందువల్ల సుప్రీంకోర్టు ఈ కేసును మూసి వేసింది. అయినా నిరసన కొనసాగించాలని క్రీడాకారులు నిర్ణయించారు. బ్రిజ్ భూషణ్ ను అరెస్టు చేయనంత కాలం క్రీడాకారుల ఆగ్రహం చల్లారదు. బ్రిజ్ భూషణ్ మీద దర్యాప్తును సుప్రీంకోర్టు ఆజమాయిషీ చేయాలన్న అభ్యర్థనను ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ తో కూడిన బెంచి నిరాకరించింది. ఎఫ్.ఐ.ఆర్. దాఖలు, క్రీడాకారులకు భద్రత కల్పించాలన్న రెండు అభ్యర్థనలను ఆమోదించాం కనక పర్యవేక్షణ ప్రస్తుత కేసు పరిధిలోకి రాదన్నది సుప్రీంకోర్టు అభిప్రాయం. కావచ్చు. భద్రత కల్పించాలన్న ఆదేశం అమలుకాలేదనడానికి బుధవారం రాత్రి జరిగిన ఉదంతమే రుజువు చేస్తోంది. కనీసం నిరసననైనా భరించలేని మోదీ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఎదిరించడం ఎలా అన్నదే ప్రస్తుతం అసలు ప్రశ్న.

అయితే మా కేంటి

ఎర్రజెండా చేతబట్టరా తీరునులే మన కష్టాలు ఎత్తర సోదరా మరల ఎర్రజెండా. రా బావ ఏమిటి ఎర్రజెండా ఎత్తమని పాడుతున్నావు. ఏం లేదు బావ ఈ మధ్య మేడే వేడుకలు జరిగాయి కదా నేను కూడా వెళ్లాను జరిగి నాల్గురోజులైనా నేను విన్నపాట మాత్రం మరువలేకున్నాను. నిజమే ఆనాడు ఆ పోరాటం వలెనే ఎనిమిది గంటల పనిదినాలు మొదలైనవి. అంతకు ముందు రాత్రి, పగలు పనిచేయించుకునేవారు. ఆ పోరాటం కార్మికులకు స్పూర్తి. ప్రస్తుతం నిర్లిప్తత, నిరాశ, నిస్పృహలు చోటుచేసుకున్నాయి. అందుకే ప్రముఖ కమ్యూనిస్టు ఆంటోనియా గ్రాంసీ నిర్లిప్తత అంటే తనకు నిలువెల్లా అసహ్యం అని ఏనాడో అన్నాడు. కాని ప్రస్తుతం నిర్లిప్తంగా ఉండేవారు ఎక్కువయ్యారు. ఇలాంటి నిర్లిప్తులు, నిరాశావాదులు, నాకేంటి అనే వారి వల్ల సమాజం సర్వనాశనమవుతోంది. పోరాటం పలుచబడి ఏమీ సాధించలేక కొంతమంది ఆశావాదులు ప్రాణాలర్పిస్తున్నారు.

నిజమే బావ కొంతమంది అందరికోసం జరిగే పోరాటంలో పాల్గొనకుండా మాకేంటి అని స్వార్థంతో, నిర్లిప్తతో, నిరాశావాదంతో ఇంటికి పరిమితమవుతున్నారు. ఇది నిజంగా క్షమించరాని నేరం. వారి వల్ల అనుకున్నది సాధించలేకపోవడంతో వచ్చే నష్టాన్ని

గుర్తించలేకపోతున్నారు. పోరాటం వల్ల కలిగే లాభనష్టాలు సమాజంలోని ప్రజలందరిది. కాని కొద్ది మంది మాత్రమే పోరాటానికి ముందుకు దూకడం వల్ల అనుకున్నది సాధించలేక పోతున్నారు. నిజమే దాని వల్ల స్వార్థ పరులు అందలమెక్కి ప్రజలను ఒప్పించడం ద్వారా కాక అణచివేసి పాలన సాగిస్తున్న సంగతి చూస్తున్నారు. సమాజంలో జరిగే ప్రతి పరిణామం తెలివైన పౌరుల, చైతన్యవంతమైన కార్యాచరణ ఫలితంగానే జరుగుతుంది. కొంతమంది త్యాగాల వల్లనే సమాజంలో మార్పు వస్తుంది. ఎక్కువమంది ఎవరో తెచ్చిపెట్టిన ఫలాలు స్వీకరించడానికి అలవాటుపడి ఇతరులపై ఆధారపడి జీవనం సాగించడానికి అలవాటు పడ్డారు. ఎక్కువమంది నిర్లిప్తతతో మాకెందుకులే వస్తే అందరికి వస్తాయి అనే పదం వెల్ల వేస్తారు. అందుకే అటు, ఇటు నిలబడలేక అటువంటి పిరికి పందలు, స్వార్థపరులంటే తనకు పరమ అసహ్యమని గ్రాంసి అంటారు.

మానవ సమూహమే సమాజం. సమాజంతో సంబంధంలేకుండా మనిషి మనలేడు. కాని ప్రస్తుతం కొంతమంది సమాజంతో నాకు పనేంటి అంటారు. ఇంకా కుల, మత, వర్గరహిత సమాజంకోసం శ్రమించేవారు వారి పరిధిలో వారు క్రియాశీలకంగా పనిచేస్తూనే ఉన్నారు. వారి శ్రమ ఫలిస్తే మంచిదేకాని చేయమనండి ఏం జరుగుతుందో చూద్దాం అనే వారెక్కువయ్యారు. అందుకు జరిగే పోరాటం మంచిదేకాని నాకు తీరిక లేదనే నిర్లిప్తవాదులు ఎక్కువయ్యారు. గతంలో ఇలా ఆలోచిస్తే మనకు స్వాతంత్ర్యం వచ్చేదికాదు. ఇటువంటి నిరాశవాదులు అనాడు ఆంగ్లేయుల నుండి విభజించి పాలించమనే సూత్రం మాత్రం వంటపట్టించుకొన్న పాలకులు ఎక్కువయ్యారు. సమాజంలో జరిగే ప్రతి నిర్ణయం సమాజంలోని ప్రతి పౌరునిమీద పడుతుందనే సంగతి మరచి ప్రవర్తిస్తున్నారు. కర్తవ్య బోధకులు కూడా తమ కర్తవ్యం పాటించరు. నిజమే బావ ప్రతిసంవత్సరం మే ఒకటిన అలవాటు ప్రకారం ఎర్రజెండా ఎగరవేయడమే కాని ఆనాటి త్యాగ ధనుల స్ఫూర్తి మాత్రం మరచిపోయారు.

ప్రస్తుతం ఎన్నో రాజకీయ పార్టీలున్నాయి. ఎవరికి నచ్చిన పార్టీలో వారు చేరి క్రియాశీలకంగా ప్రతి వ్యక్తి పనిచేయాలి కాని 5 కోట్ల జనాభాలో ఉన్న అన్ని పార్టీలలో సభ్యత్వం ఉన్నవారు కోటిమంది కూడా ఉండరు. అంటే ఎవరో సాధించిపెట్టిన ఫలాలు అందరికీ లభ్యం అవుతాయికదా అని నిర్లిప్తతతో వ్యవహరించేవారే ఎక్కువ. అంటే ఎవరో సాధించిపెడితే వారి మీద ఆధారపడేవారే ప్రస్తుతం సమాజంలో ఎక్కువగా ఉన్నారు. అలా ఉన్నవార్ని పాలక పార్టీలు తమ ఖాతాలో వేసుకుని నియంతృత్వపాలన సాగిస్తున్నారు. అందుకే గ్రాంసి ప్రతి వ్యక్తి తనకు నచ్చిన సిద్ధాంతంతో పనిచేసే పార్టీలో చేరాలి కానీ తటస్థంగా నిర్లిప్తతతో జీవనం సాగించడం ఆయనకు నచ్చదు. అటువంటి వ్యక్తులంటే ఆయనకు పరమ అసహ్యం. 86 సంవత్సరాల క్రితం గ్రాంసీ చనిపోయినా, ఆయన ఆలోచన ఇప్పటికీ ఆచరణీయమే. అయితే నాకేంటి అనే భావనకు స్వస్తి పలికి ప్రతి వ్యక్తి తనకు నచ్చిన సిద్ధాంతంతో ముందుకు సాగాలి.

వ్యాస రచయిత సెల్: 9885569394

గొప్ప ఆలోచనాపరుడు మార్క్స్

నిత్య చక్రవర్తి

ప్రపంచ జనావళి దోపిడీ నుంచి విముక్తి పొందడానికి కావలసిన సిద్ధాంతాన్ని అందించిన గొప్ప ఆలోచనాపరుడు కార్ల్‌మార్క్స్. ఆయన 1818 మే 5వ తేదీన జర్మనీలో జన్మించి 1883 మార్చి 14న లండన్‌లో మరణించారు. ప్రపంచాన్ని మార్చడానికి సమకూర్చిన సిద్ధాంతాలలో భాగస్వామి, మార్క్స్‌తో విడదీయలేని స్నేహ బంధం కలిగిన ఫ్రెడరిక్ ఏంగిల్స్, మార్క్స్ సమాధి వద్ద మాట్లాడుతూ ఇలా అన్నారు. మార్క్స్ చనిపోయిన తర్వాత మూడు రోజులకు మార్చి 17న ఆయన సమాధిని సందర్శించి తన స్నేహితుడికి నివాళి అర్పించారు. మార్చి 14 మధ్యాహ్నం 3గంటలకు 15 నిమిషాలకు తక్కువగా ఉన్న సమయంలో మార్క్స్ శాశ్వతంగా కన్నుమూశారని ఏంగెల్స్ తెలిపారు. ఆయనను వదిలి రెండు నిమిషాలు వెళ్లి తిరిగి వచ్చేటప్పటికీ మార్క్స్ కుర్చీలోకూర్చుని ప్రశాంతంగా నిద్రించారు. ఆ నిద్ర శాశ్వత నిద్ర అని ఏంగిల్స్ చెప్పారు. ఆయన మరణంతో ఐరోపా, ఆమెరికాలలో సమరశీల పోరాటాలకు ఎనలేని నష్టం కలిగింది. దోపిడీకి గురవుతున్న శ్రామిక జనావళి స్ఫూర్తికి పెద్ద నష్టం జరిగింది. అని ఏంగిల్స్ అన్నారు. ఆయనలేని లోటు ఎన్నటికీ తీరనిది.

నేను హిందుస్థాన్ టైమ్స్ పత్రిక తరఫున 1990 జనవరిలో లండన్‌కు వెళ్లాను. మార్క్స్ 1851 నుంచి 1855 వరకు నివసించిన 28 డీన్ స్ట్రీట్‌కు(సోహో) చాలా సమీపంలో నేను ఉన్న హోటల్ ఉంది. మార్క్స్ నివసించిన ఫ్లాట్‌ను చూడాలని కోరుకున్నాను. ఆయన నివాసంలోనే ఐరోపా నుంచి అనేకమంది సుప్రసిద్ధ విప్లవకారులు వచ్చి మార్క్స్‌తో సమావేశమయ్యేవాళ్లు. ముఖ్యంగా జర్మనీ, ఫ్రాన్స్ నుంచి ఎక్కువమంది వచ్చేవారు. ఆ కాలంలో మార్క్స్ పరిశోధన, రచనవ్యాసంగంలో తలమునకలై ఉన్నారు. మార్క్స్ కుటుంబం పేదరికంవల్ల, అప్పుడప్పుడు అద్దె కూడా చెల్లించలేని పరిస్థితి కారణంగా తరచుగా ఇళ్లు మారేవారు. 1951 జనవరిలో 28 డీన్ స్ట్రీట్‌లో ఫ్లాట్‌కు మారారు. అంతకుముందు చాలా దగ్గరలో 64 డీన్‌స్ట్రీట్‌లోని ఇంటిలో కొద్దికాలం ఉన్నారు. ఆ ఇంట్లోనే ఆయన కుమార్తె ఫాక్సి అనారోగ్యంతో చనిపోయింది. మార్క్స్ సతీమణి జెన్నీ కుమార్తె మరణంపై ఎంతగానో దు:ఖించారు. మార్క్స్ కుటుంబం 1848లో లండన్ వచ్చింది. అప్పటినుంచి విపరీతమైన చలి, ఆకలి, వ్యాధులు, నిరంతర ఆర్థికసమస్యలు వెంటాడాయి. జబ్బుతో బాధ పడుతున్న కుమార్తెను జెన్నీ చూసుకుంటూ రచనలో నిమగ్నమైన మార్క్స్‌కు



ప్రశాంత వాతావరణం కల్పించారు. మార్క్స్ ఉన్న భవనంపైన అపార్టు మెంట్‌లో నివసించేవారు. నేను ఆ భవనం చూసేందుకు వెళ్లినప్పుడు కిందిఫ్లాట్‌లో ఒక రెస్టారెంటు ఉంది. ఆ రెస్టారెంటు యజమాని మార్క్స్ నివసించిన అపార్టుమెంటును చూసుకుంటున్నారు. అపార్టుమెంటు సందర్శకుల కోసం నిర్దిష్ట సమయాలు ఉండేవి. వారికోసం అవసరమైన ఫర్నిచర్‌ను కూడా రెస్టారెంటు యజమాని అక్కడ ఉంచేవారు. ఆ అపార్టుమెంటు రెండు గదులతోనే ఉండేది. ముందు గదిలోనే భోజనం, అధ్యయనం ఉండేవి. వెనుక గదిలో వంటచేయడం, నిద్రించడం ఉండేది. తాగడానికి ఇతర అవసరాలకు నీటిని కిందనుంచే తెచ్చుకోవలసి వచ్చేది. ఆ భవనంలో పౌష్టికాహార లోపంతో ఉన్న కుటుంబాలు చాలా నివసించేవి. మరుగుదొడ్డిలో నీటి సరఫరా కనెక్షన్ కూడా ఉండేదికాదు.

అనేకమంది మార్క్స్‌స్నేహితులు తమ దేశాల్లో ప్రభుత్వాలు వెంటాడటంతో ముఖ్యంగా జర్మనీ, ఫ్రాన్స్ నుంచి ప్రముఖ విప్లవకారులు వచ్చి ఆయన వద్దే ఉండేవారు. ముందుగది 15అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పు ఉండేది. అయినప్పటికీ మార్క్స్ అక్కడే అధ్యయనం చేసే వారు. గదిలో ఒక కుర్చీ, టేబుల్ మాత్రమే నాకు కనిపించాయి. ఆ టేబుల్‌వద్ద కూర్చుని మార్క్స్ రచనలు చేసేవారు. అదే కుర్చీలో కూర్చుని రాసుకునేవారని రెస్టారెంట్ యజమాని చెప్పారు. మార్క్స్ 28 డీన్‌స్ట్రీట్ అపార్టుమెంటు నుండి మరో మెరుగైన ఫ్లాట్‌కు మారేవరకు ఆ ఇంటిని 'ది హౌస్ ఆఫ్ మెహర్' అని పిలిచేవారు. ఇతర దేశాలనుంచి, అక్కడి ప్రభుత్వాల నుంచి తమనుతాము కాపాడుకునేందుకు స్నేహితులు మార్క్స్ దగ్గరకు వచ్చి ఉండేవారు. అదే ఇంటిలో సుదీర్ఘ చర్చలు సాగేవి. అర్థరాత్రి దాటిన తర్వాత కూడా ఆ చర్చలు జరిగేవి. స్నేహితులతో సహా అందరికీ వంట చేసేందుకు అవసరమైన వస్తువులను దగ్గరలోని షాపుల్లో అప్పుపైన తీసుకురావడానికి ఎంతో శ్రమపడేవారు. ఇతర దేశాలనుంచి వచ్చే యువకులు సాయంకాలాల్లో మార్క్స్‌ను కలిసేవారు. రాత్రి భోజనం కోసమని వారు జెన్నీ చేతికి కొంతడబ్బు ఇచ్చేవారు. ఆతిథ్యం ఇవ్వడంలో జెన్నీ ఎంతో దయార్ద్రత కనబరచేవారు. మార్క్స్ ఇంట్లో పనిచేసే అమ్మాయి హెలెన్ డిముత్ ఎంతో రుచికరంగా వంటచేసేది.

మార్క్స్‌తో చర్చలు జరిగేసమయంలో పాల్గొన్నవారి మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. కొన్నిసార్లు ఒకరిపైఒకరు కలబడేవారు కూడా. చర్చల్లో ఉన్నవారికి జెన్నీ రాత్రి భోజనం అందించేది. మార్క్స్ జర్మనీ, ఫ్రాన్స్ నుంచి వచ్చే స్నేహితులవలెనే మద్యాన్ని ఎంతో ఇష్టంగా సేవించే వారు. ఒకరిద్దరు ధనికులైన స్నేహితులు మార్క్స్‌కు అధికంగా డబ్బు అందించేవారు. స్నేహితులతో కలిసి ఫెర్రింగ్‌డన్ వీధిలో ఉన్న వైన్‌షాపులో ఎక్కువగా కలుసుకునేవారు. అలా కలుసుకునే గ్రూపును మార్క్స్ "డి సినగోగ్' అని పిలిచేవారు. 1852 కొత్త సంవత్సరం ప్రారంభానికి ముందు క్రిస్మస్ వేళల్లో రాత్రిపూట వైన్‌షాపులో కూర్చొని మద్యం సేవిస్తూ సుదీర్ఘంగా చర్చలు జరిపేవారు. ఆయన స్నేహితులతో చర్చలు జరుపుతున్నప్పుడు పేదిరికం, కుటుంబసభ్యులకు వ్యాధులు వెంటాడేవి. 1852 ఏప్రిల్‌లో మార్క్స్‌సంతానంలో ఒకరు ఫ్రాన్సిస్కా బ్రాంకైటిస్‌తో చనిపోయారు. ఆ పాపకు వైద్య చికిత్స చేయించ డానికి కూడా మార్క్స్ వద్ద డబ్బులుండేవి కావు. అంతిమంగా శవపేటిక కొనుగోలుకు కూడా డబ్బుల్లేవు. మార్క్స్ జీవితచరిత్రను 2011లో మేరి గాబ్రియెల్ ప్రచురించారు. మార్క్స్‌కోసం వచ్చిన ఒక గూఢచారి తన నివేదికలో, బట్టలుఉతకడం, ఇల్లు శుభ్రం చేయడం తదితరపనులు చేసేవాడని, మద్యపానాన్ని ఇష్టపడేవారని, నిద్రకు నిర్దిష్ట సమయం ఉండేదికాదని పేర్కొన్నట్లు ప్రచురణకర్త మార్క్స్ జీవిత చరిత్రలో ఉదహరించారు. 1855 ఏప్రిల్‌లో మార్క్స్‌కుమారుడు టీబీతో మరణించాడు. లండన్ వచ్చిన తర్వాత ముగ్గురు సంతానం మరణించారు. మార్క్స్ ఎదుర్కొన్న అనేక విషాదఘటనలను ఏంగెల్స్ తన రచనల్లో పేర్కొన్నారు.

(నేడు మార్క్స్ 205వ జయంతి సందర్భంగా)

ఇ-మెయిల్

రాష్ట్ర ప్రభుత్వ సున్నితత్వం

ప్రభుత్వానికి సమస్యపై అవగాహన, పరిష్కారం పట్ల చిత్తశుద్ధి, స్పందించే గుణంలో సున్నితత్వం ఉంటేనే సుపరిపాలన సాధ్యం. నేడు రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఒక నూతన విధానం ఆహ్వానించదగింది. పదవ తరగతి దాటిన విద్యార్థులకు దరఖాస్తుతో సంబంధం లేకుండానే కులధ్రువీ కరణ పత్రాలు అందజెయ్యడం ఒక మంచి ప్రయత్నం. సున్నితమైన స్పందనకు నిదర్శనం. పైకి చిన్న విషయంగా కనబడుతున్నా కులధ్రువీకరణ పత్రాలు సంపాదించడానికి ఆయా వర్గాలు, ప్రత్యేకించి పేదలు, ఆదివాసీలు, దళితులు ఎంత కష్టపడాల్సి వస్తుందో చెప్పనలవికాదు. పదవతరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తిచేసి పైచదువు కోసం దరఖాస్తుచేస్తే కులధ్రువీకరణపత్రం జత చెయ్యడం తప్పనిసరి. ఒక వైపు జాయిన్ అవ్వాల్సిన సమయం దాటిపోతోంది. మరోవైపు ఎప్పటికీ సంబంధిత కార్యాలయం (మండల కేంద్రంలో ఉంటుంది) నుండి ఉలుకూపలుకు ఉండదు. ఫైల్ సులభంగా కదలదు. కదిలించు కోగల శక్తి పేద కుటుంబానికి ఉండదు. దానితో బాటు ఆ పత్రాలకై విపరీతమైన రద్దీ ఒకేసారి ఉండడం అధికారులవైపు నుండి ఒక వాదన. వెరసి పాస్ అవ్వడం కన్నా, ఆయా పత్రాలు పొందడం పెద్ద గగనం. ఒక్కోసారి ఈ ఒక్క కారణంతోనే ఒక విద్యాసంవత్సరం కోల్పోవడం కూడా అసాధారణం కాదు. నాకు, నాలాంటి ఎంతోమందికి ఇది ప్రత్యక్ష అనుభవం. వారాలు, వారాలు ఇదే పనిమీద మా పేద తలిదండ్రులు పనులన్నీ పక్కనబెట్టి కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. పత్రం చేతికందిన రోజు ఫస్ట్‌క్లాస్‌లో పాసవ్వడం కన్నా గొప్పగా ఉండేది. తరువాత మీసేవ కేంద్రాలు వచ్చాక గత కొన్నేళ్లుగా పరిస్థితి కొంత కుదుటపడింది. అప్పటిలా అంతస్థాయి పోరాటం లేకపోయినా కొంత సులభమైంది. రొటీన్‌గా రావాల్సిన పత్రాలకి కూడా పెద్దల సిఫార్సులు అవసరమయ్యే పరిస్థితి. ఆ కష్టం తెలిసిన వారికి ఈ రోజు ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానం ఎంత గొప్పదో, ప్రజలపై ఎంత గౌరవప్రదమైన స్పందనో అన్నది అర్థమౌతుంది. 40 లక్షల కుటుంబాలకు, 10 లక్షలమంది పదవ తరగతి విద్యార్థులకు అడగకుండానే వారివారి కులధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచడం, అందించడం గొప్ప మేలు.

డా.డి.వి.జి.శంకరరావు, 94408 36931

మూఢనమ్మకాలు తిరస్కరించిన బుద్ధుడు

కుల, మత, వర్ణ, వర్గ, రంగు బేధంలేకుండా అందర్నీ అన్నిజీవరాశుల్ని సమతాభావంతో చూడాలని దుఃఖంలేని సుఖవంతమైన జీవితాన్ని గడపటానికి 2500 ఏళ్లనాడు ప్రపంచ మానవాళికి మార్గదర్శకం చేశాడు సిద్ధార్థ గౌతముడు. మూఢనమ్మకాలను, దురాచారాలను పాటించక ఉన్నదిఉన్నట్లుగా చూచి, ధర్మమార్గంలో పయనించాలని సూచిస్తూ, మానవాళితో పాటు సకల జీవరాశులు భవ చక్రాన్నుంచి బయటపడి నిర్వాహణపథాన్ని చేరుకోవటానికి పంచశీల, ఆర్య, అష్టాంగ మార్గాలను భోధించి, అనుభవపూర్వకంగా ప్రతి వ్యక్తి బుద్ధుడు గావచ్చని తెలియజెప్పిన మహనీయుడు. బుద్ధ పూర్ణిమను బుద్ధ జయంతి అని కూడా పిలుస్తారు, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధులకు ముఖ్యమైన పండుగ. ఇది బౌద్ధం స్థాపకుడిగా సిద్ధార్థ గౌతమ జననాన్ని, మరణానికి గుర్తుగా జరుపుకుంటారు. బౌద్ధ గ్రంథాల ప్రకారం, బుద్ధుడు నేపాల్‌లోని లుంబినిలో క్రీస్తుపూర్వం 563 సంవత్సరంలో వైశాఖ మాసం (ఏప్రిల్/మే) పౌర్ణమి రోజున బుద్ధుడు జన్మించాడు. 'పూర్ణిమ' అనే పదం సంస్కృతంలో 'పౌర్ణమి'ని సూచిస్తుంది, ఇది పౌర్ణమి రోజున ఎందుకు జరుపుకోవాలో వివరిస్తుంది 'జయంతి'. బుద్ధుడు అనే పదం 'బోధి' లేదా జ్ఞానాన్ని పొందిన వారికి ఇస్తారు. అందుకే జ్ఞానోదయం పొందిన తర్వాత సిద్ధార్థుడిని బుద్ధుడు అని పిలిచారు. ఇది సాధారణంగా హిందూ/బౌద్ధ చాంద్రమాన క్యాలెండర్లలో 'వైశాఖి' నెలలో జరుపుకుంటారు.

బుద్ధుడు తన ప్రారంభ జీవితాన్ని యువరాజుగా గడిపాడు. తరువాత జ్ఞానోదయం కోసం తన రాజ జీవితాన్ని త్యజించాడు. చాలా సంవత్సరాలు ధ్యానం, స్వీయ-క్రమశిక్షణ తర్వాత భారతదేశంలోని బుద్ధగయలో బోధి చెట్టుకింద జ్ఞానోదయం సాధించాడు. బుద్ధుడు భారతదేశంలోని కుషీనగర్‌లో 80 సంవత్సరాల వయస్సులో మరణించే వరకు తన శిష్యులకు బౌద్ధమత సూత్రాలను బోధిస్తూ జీవితాంతం గడిపాడు. ఆయన బోధనలు కరుణ, అహింస, స్వీయ-అవగాహన ప్రాముఖ్యతను నొక్కిచెబుతాయి. అయినప్పటికీ, బుద్ధుని అనుచరులు ఆయన పుట్టినరోజును అధికారికంగా జరుపుకోలేదు. అనేక శతాబ్దాలుగా, బుద్ధుని గౌరవించే పండుగలు జరిగాయి. 1950 మే నెలలో శ్రీలంకలోని కొలంబోలో జరిగిన బౌద్ధుల ప్రపంచ ఫెలోషిప్ మొదటి సమావేశంలో బుద్ధ పూర్ణిమను వెసక్ సందర్భంగా వేడుక నిర్వహించారు. పౌర్ణమి రోజున బుద్ధుడు మోక్షం పొందడం వల్ల మే నెలలో పౌర్ణమి రోజు శుభప్రదంగా ఉంటుందని భావిస్తారు. బౌద్ధం జనాదరణ పొందటానికి కారణం అహింస, జీవితంపై గౌరవం, స్త్రీలకు సమానమైన ప్రాతినిధ్యం - సంప్రదాయం, పురోగతి, ఆధునిక ఆలోచనలు, బోధనలు కారణం. ఈ నేపధ్యంలో ప్రపంచంలోని అనేక దేశాలు బౌద్ధ దేశాలుగా మార్పు చెందాయి. ముఖ్యంగా ఆసియాలో. ప్రతి సంస్కృతి ప్రధాన సిద్ధాంతాలను స్వీకరించి, సమీకరించు కోవడంతో బౌద్ధం ఉప-విభాగాలుగా విభజన జరిగింది. నేడు బౌద్ధమతాన్ని ప్రపంచవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆచరిస్తున్నారు. బుద్ధుని జీవిత కాలంలోనే తెలుగు నేలపై బౌద్ధ ధమ్మం ప్రవేశించింది. అశోక చక్రవర్తి పోషణలో ధమ్మవాచికలు తెలుగు నేల నలుదిశలా వ్యాపించాయి. దాదాపు 300 బౌద్ధ స్థావరాలతో, స్థూపాలు, చైత్యాలు, విహారాలు, బుద్ధ ప్రతిమలతో తిసరణాలు మారుమోగాయి. బుద్ధుడు బోధించిన శాంతిమయ జీవనం తెలుగు వారిని ధార్మికులుగా తీర్చిదిద్దింది.

ఆచార్య నాగార్జునుడు, ఆర్యదేవుడు, దిన్నాగుడు, భావ వివేకుడు, బుద్ధ ఘోషుడు, ధర్మకీర్తి లాంటి బౌద్ధచార్యులు తెలుగునేలను మరింత ధార్మికంగా మలిచారు. కాలచక్ర మూల తంత్రాన్ని ధాన్యకటకంలో బోధించాడన్నది టిబెటిన్ల నమ్మకం. తీరాంధ్ర నుంచి బౌద్ధ ధర్మ వీచికలు శ్రీలంక, మైన్మార్, చైనా దేశాలకు ప్రసరించాయి. బుద్ధభగవానుని బోధనలను శిల్పకళ ద్వారా ప్రపంచవ్యాప్తం గావించిన ధాన్య కటక అమరావతి శ్రీపర్వత విజయపురి (నాగార్జున కొండ) ప్రపంచ బౌద్ధుల్ని వేల సంఖ్యలో ఆకర్షిస్తూ నేటి సమాజానికి బౌద్ధమే శరణ్యమన్న సందేశాన్నందిస్తున్నాయి. ఆనాడు బుద్ధుడు సమాజాన్ని మార్చాల్సిన అవసరాన్ని గుర్తించాడు. ఆనాటి తత్వశాస్త్రాలని నిశితంగా పరిశీలించి వాటికి ప్రాపంచిక దృక్పథాన్ని, ఆధిక్యతను వివరించిన మొదటి తత్వవేత్త. అంబేద్కర్ చెప్పినట్టు కొన్ని ఉపనిషత్తులు బుద్ధునిలా లోతుగా చర్చించాయి. కాని అవి బుద్ధునిలా ఆచరణకు పూనుకోలేదు. బుద్ధుడు ప్రజాజీవితంలో మమేకమై వాళ్ళ సమస్యలు అర్థం చేసుకొని వైద్యం, విద్య, స్నేహాన్ని, సౌభ్రాతృత్వాన్ని అందిస్తూ జీవించాడు. బుద్ధుని బోధనల ద్వారా ప్రపంచం ఎంతో ప్రభావితమైంది. బుద్ధుని కాలం నాటికి గ్రీస్‌తో భారతదేశానికి పూర్వకాలం నుంచి సంబంధాలు వున్నాయి. ఆనాడు గ్రీకు తత్వశాస్త్రం ప్రాధమికస్థాయిలో ఉంది. గ్రీకు తత్వవేత్తలపై బౌద్ధం ప్రభావం ఉంది. ప్లేటో, అరిస్టాటిల్ కాలం నాటికి బౌద్ధం భారత దేశంలో ఒక బలమైన శక్తిగా అవతరించింది. చాలా మంది తత్వవేత్తలు గ్రంధాలు చదివి, ప్రజలలో ప్రత్యక్షంగా సంబంధం లేకుండా వారి భావాలు ప్రకటించారు. వాళ్ళ భావాలను వ్యతిరేకించినవారిని తీవ్రంగా వెంటాడారు.

బుద్ధుడు నేను చెప్పానని గాని, మరొకరు చెప్పారనిగానీ దేనిని నమ్మకు. ఏది సత్యమో దాన్ని నమ్ము, ఆచరించు అని తెలియజేసాడు. బుద్ధుడు సమతా, ప్రజ్ఞ, కరుణ,స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను ప్రతిపాదించారు. వర్ణ, కుల వ్యవస్థలు వీటికి వ్యతిరేకం ఇది. అట్టడుగు వారి ఉన్నతి కోసం ప్రతిపాదించారు. బ్రాహ్మణిజం ప్రయోజనాల కోసం నిర్మించారు. బౌద్ధం అట్టడుగు వర్గాల వారికి, వారి పైవారికి మధ్య మార్గాన్ని ప్రతిపాదించింది. వైరుధ్యం, పరిణామం, గుణం, అభావం అనే మౌలిక గతితార్కిక సూత్రాలను విస్తృతంగా చర్చించి జీవితానికి అన్వయించి, ఆచరించి ప్రాపంచిక దృక్పథంగా రూపొందించిన తొలి తత్వవేత్త సామాజిక, రాజకీయ శాస్త్రవేత్త, విప్లవకారుడు బుద్ధుడు. బౌద్ధం ప్రేమ, జ్ఞానం, విద్య, వైద్యం, ఐక్యతను ఆచరించింది. బౌద్ధం వ్యక్తిని, వర్గాన్ని, సమాజాన్ని పరిశీలించి సమజాన్నుంచి, వ్యక్తినుంచి రాజ్యం యొక్క అవసరం లేకుండా చేస్తుంది. అందువల్ల రాజ్యం అవసరం లేకుండా పోయింది. విద్య, వైద్యం, ప్రేమ ద్వారా సామజిక ఆచరణ అంశాల్ని మిగతా మతాలుస్వీకరించాయి. కానీ అయన చనిపోయాక బ్రాహ్మణీయులు దానీ మతరూపంలోకి నెట్టారు. సమాజాన్ని జ్ఞానం, పరోపకారం ద్వారా అందరికి జ్ఞానాన్ని అందించటం సామాజిక సంస్కృతిలో జీవనాన్ని అందించే ముఖ్య లక్షణంగా సేవా దృక్పదంలో ముందుకు సాగింది.

రేగుళ్ళ మల్లికార్జునరావు, సంచాలకులు,
భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్, 9491659899

సరిహద్దు వద్దే రైతుల అడ్డగింత

ఢిల్లీ పోలీసుల నిర్బంధంలో అన్నదాతలు

రెజ్లర్లకు పెరుగుతున్న మద్దతు

న్యూఢిల్లీ: రెజ్లర్ల ఆందోళనకు రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. రాజకీయ పార్టీలు సహా సామాజిక సంస్థలు, ప్రజాసంఘాలు, రైతులు, మేధావులు తదితరులు రెజ్లర్ల ఆందోళనకు సంఘీభావం ప్రకటిస్తున్నారు. తాజాగా జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న రెజ్లర్లకు మద్దతు తెలిపేందుకు ఢిల్లీ వస్తున్న రైతుల బృందాన్ని సింఘు సరిహద్దు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. 24 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ పోలీసులు తమపై దాడి చేశారని రెజ్లర్లు గతరాత్రి ఆరోపించారు. తీవ్ర ఆందోళనలో ఉన్న రెజ్లర్లకు సంఘీభావం తెలపడానికి రైతులు ఢిల్లీ వస్తుండగా మధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం సుదీర్ఘకాలంగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు అండగా నిలవాలని ప్రజలకు రైతులు పిలుపునిచ్చారు. ధర్నా శిబిరం వద్ద గతరాత్రి గందరగోళం చెలరేగడంతో ఢిల్లీ పోలీసులు పెట్రోలింగ్‌ను తీవ్రతరం చేశారు. పోలీసు పికెట్లు పెంచారు. సరిహద్దుల్లో భారీ బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. సరిహద్దులను మూసివేయలేదని, అయితే, రైతుల రాకను అడ్డుకోవడానికి నిఘాను తీవ్రతరం చేశామని పోలీసులు చెప్పారు. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ నుంచి ట్రాక్టర్లలో పెద్దఎత్తున రైతులు వస్తున్నట్లు సమాచారం అందిందని పోలీసు ఉన్నతాధికారి ఒకరు గురువారం చెప్పారు. సింఘు సరిహద్దు వద్ద 24 మంది రైతులను అదుపులోకి తీసుకున్నామని, వారి హరియాణాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చారని తెలిపారు. రైతుల వాహనాలను పోలీసు స్టేషన్లకు తరలించామన్నారు. కాగా, సింఘు సరిహద్దు వద్ద తనను అరెస్టు చేసినట్లు రైతు నాయకుడు అభిమన్యు కొహర్ ట్విట్టర్ వేదికగా ఆరోపించారు. సింఘు సరిహద్దు వద్ద తమను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారని, పెద్దవారని కూడా చూడకుండా కొంతమంది రైతులపై చేయి చేసుకున్నారని ఆయన వివరించారు. తమను బవానా సెక్షన్ 1 పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారని, మన బిడ్డలు రెజ్లర్ల గౌరవం కోసం అందరూ ఇళ్ల నుంచి బయటికి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీజేపీ అవినీతి విధానాల వల్లే ధరల పెరుగుదల: ప్రియాంక

కనకగిరి (కర్నాటక): బీజేపీ ప్రభుత్వ అవినీతి విధానాల కారణంగా నిత్యావసర వస్తువులు, సేవల ధరలు పెరిగిపోతున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ మండిపడ్డారు. గురువారం కొప్పల్ జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. కర్నాటకలో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని, ఇక్కడి బీజేపీ ప్రభుత్వాన్ని 40 శాతం కమీషన్ ప్రభుత్వంగా ప్రజలు పిలుస్తున్నారని అన్నారు. 'రాష్ట్రంలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వంట గ్యాస్ సిలిండర్, బియ్యం, పప్పులు, పిండి ధరలు పెరిగాయి. అవినీతి ప్రభుత్వం అవినీతి విధానాలను రూపొందించడమే ధరల పెరుగుదలకు కారణం' అని ఆమె తీవ్రంగా విమర్శించారు. మే 10న కర్ణాటకలోని కొప్పల్ జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె అన్నారు. కాంట్రాక్టర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆమె చెబుతూ... ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో లంచం ఇవ్వాల్సి రావడమే ఇందుకు కారణమని తెలిపారు. ఎన్నికల రోజున బీజేపీ అగ్రనేతల ప్రసంగాలను చూసి మోసపోవద్దని, ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చడమే ధ్యేయంగా వారి ప్రసంగాలుంటాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రియాంక కోరారు.

బజరంగ్ దళ్ కార్యకర్తల వీరంగం

మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ఆఫీసు ధ్వంసం

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో బజరంగ్‌దళ్ కార్యకర్తలు విధ్వంసానికి బరితెగించారు. జబల్‌పూర్‌లో కాంగ్రెస్ కార్యాలయంలోకి చొచ్చుకువచ్చిన బజరంగ్ దళ్ కార్యకర్తలు కాంగ్రెస్ ఆఫీసును ధ్వంసం చేశారు. బజరంగ్ దళ్ కార్యకర్తల వీరంగాన్ని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత కేకే మిశ్రా తీవ్రంగా ఖండించారు. హింసాకాండ, అల్లర్లు, హత్యలు, గూండాయిజానికి పాల్పడటం, గర్భాలో పాల్గొనే మహిళల గురించి ఆరా తీయడం వంటి పనులు బజరంగ్ దళ్ కార్యకర్తలు చేస్తుంటారని అన్నారు. బజరంగ్ దళ్ జాతీయవాద సంస్థని సీఎం చెబుతున్నారని, ఆయన ఈ ప్రకటన చేసిన 24 గంటల్లోనే బజరంగ్ దళ్ కార్యకర్తలు విధ్వంసానికి పాల్పడ్డారని మిశ్రా అన్నారు. జాతీయ వాదులు ఇలాంటి పనులు చేస్తారా అని ప్రశ్నించిన మిశ్రా దీనిపై సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. మంత్రుల పిల్లలందరూ బజరంగ్ దళ్‌లో చేరాలని సీఎం సర్క్యులర్ జారీ చేయాలని మిశ్రా కోరారు. బజరంగ్ దళ్ జాతీయవాద సంస్థ అయితే సీఎం ఈ ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు.

బీజేపీ విద్వేష రాజకీయాలతో హింస

మణిపూర్ హింసపై కాంగ్రెస్

న్యూఢిల్లీ: బీజేపీ విద్వేష రాజకీయాలతో మణిపూర్ మండుతోందని కాంగ్రెస్ విమర్శించింది. రాజకీయ లబ్ధికోసం కులాలు, మతాల మధ్య బీజేపీ వైషమ్యాలు సృష్టిస్తోందని మండిపడింది. మణిపూర్‌లో శాంతి పునరుద్ధరణపై దృష్టి కేంద్రీకరించాలని ప్రధాని నరేంద్రమోదీకి కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ సూచించారు. సంయమనం పాటించాలని, శాంతి పునరుద్ధరణకు సహకరించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే మణిపూర్ ప్రజలకు విన్నవించారు. 'మణిపూర్ మండుతోంది. కులాలు, మతాల మధ్య బీజేపీ విద్వేషం సృష్టిస్తోంది. సుందరమైన రాష్ట్రంలో శాంతిని ధ్వంసం చేస్తోంది' అని ఖడ్గే ట్విట్టర్ వేదికగా తూర్పారబట్టారు. 'మణిపూర్‌లో హింస చెలరేగడానికి బీజేపీ విద్వేష, విభజన రాజకీయాలు, అధికార కాంక్ష కారణం. అందరూ సంయమనం పాటించి శాంతి పునరుద్ధరణకు సహకరించాలని అన్ని వర్గాలను కోరుతున్నాం' అని ఖడ్గే విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో శరవేగంగా శాంతిభద్రతలు క్షీణించడం ఆందోళనకరంగా ఉందని రాహుల్ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో సాధారణ పరిస్థితుల పునరుద్ధరణపై ప్రధాని దృష్టి కేంద్రీకరించాలని విజ్ఞప్తి చేశారు. శాంతియుతంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2021లో బీజేపీ మణిపూర్‌లో అద్భుత విజయం సాధించిందని, 2022లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడిందని, అయితే బీజేపీ అధికారం చేపట్టి 15 నెలలు కూడా కాకముందే రాష్ట్రం అగ్నిగుండంగా మారిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వీడియో ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాలను నిలిపివేశారని, ముఖ్యమంత్రి ఎక్కడో దాక్కున్నారని, ఎమ్మెల్యేలు వరుసబెట్టి రాజీనామా చేస్తున్నారని రమేశ్ ఆరోపించారు. ఇంత జరుగుతున్నా ప్రధానమంత్రి, హోంమంత్రి ఏమి చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కర్నాటక విభజన కార్యక్రమాల్లో ఇద్దరూ బిజీగా ఉన్నారని విమర్శించారు. 'మణిపూర్‌లో ఇషాదకర ఘటనలు జరుగుతున్నాయి. మణిపూర్‌లో భిన్నమతాలు, కులాల ప్రజలు ఉన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా లేరు. యువత అసంతృప్తిగా ఉంది. గిరిజనులు, గిరిజనేతరులు సైతం అసంతృప్తితోనే ఉన్నారు. ఇది ప్రజాతీర్పుకు నమ్మకద్రోహమే'నని రమేశ్ విమర్శించారు.

బీజేపీ ఓటమి హిందూత్వ శక్తులకు ఎదురుదెబ్బ

కర్నాటక ఎన్నికలపై సీపీఎం వ్యాఖ్య

న్యూఢిల్లీ: కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి హిందూత్వ శక్తులకు పెద్ద ఎదురుదెబ్బ అవుతుందని సీపీఎం గురువారం పేర్కొంది. లౌకిక, ప్రజాస్వామిక ప్రతిపక్ష పార్టీలు ఏకమై 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పెద్ద సవాల్ విసరడానికి వీలుంటుందని స్పష్టంచేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని సీపీఎంకు చెందిన పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయం అభిప్రాయపడింది. బీజేపీకి సంబంధించినంత వరకు రాజకీయ ఆధిపత్యం కోసం ఆరాటపడుతోంది. కర్నాటకలో తిరిగి అధికారం చేజిక్కించుకోవడం ద్వారా ఇతర దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించాలని కోరుకుంటుంది. దక్షిణాదిలో కర్నాటక రాష్ట్రం ఒక్కటే బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ కూటమి రాజకీయంగా, సైద్ధాంతికంగా ప్రాధాన్యత కలిగి ఉంది. ఇప్పుడు జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమి చెందితే హిందుత్వశక్తులకు పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లే. అదేసమయంలో లౌకిక, ప్రజాస్వామిక ప్రతిపక్ష పార్టీలు బలం పుంజుకొని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి సవాల్ విసరడానికి మంచి అవకాశం ఉందని సంపాదకీయం పేర్కొంది. కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. అవినీతి విశృంఖలమైంది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతుల కష్టాలు పెరిగాయి. బీజేపీ కేంద్ర నాయకత్వం మాత్రం గెలుపు కోసం హిందుత్వ అజెండాతో విభజన రాజకీయాలు చేస్తోందని విమర్శించింది. హిందుత్వ ప్రచారం అమిత్‌షా, నరేంద్రమోదీ ప్రధానంగా భుజాన వేసుకొని ప్రచారం చేస్తున్నారు. బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని అమిత్‌షా చెబుతున్నారు. కాంగ్రెస్ గెలిస్తే కర్నాటకలో అల్లర్లు చోటు చేసుకుంటాయని హెచ్చరిస్తున్నారని తెలిపింది. మరోవైపు, కాంగ్రెస్ అధినాయకత్వం ఉగ్రవాదుల రక్షకులుగా, బుజ్జగింపులకు మాస్టర్స్‌గా వ్యవహరిస్తోందని మోదీ ప్రచారం చేస్తున్నారు. బీజేపీ తన మేనిఫెస్టోలో ఉమ్మడి పౌరస్మృతి, ఎన్‌ఆర్‌సీని చేర్చింది. దీనితోపాటు ఆలయాల వద్ద స్థానిక వ్యాపారాలను నియంత్రిస్తామని, ఆలయాల వద్ద ముస్లింలు దుకాణాలు ఏర్పాటు చేయకుండా నిషేధం విధిస్తామని ప్రచారం చేస్తోందని విమర్శించింది. మరోవైపు, బీజేపీ అభ్యర్థులకు ఓటేస్తే ప్రధాని నరేంద్రమోదీకి వేసినట్లేనని బసవరాజు బొమ్మై ప్రచారం చేస్తున్నారని తెలిపింది.

రెండు రోజుల్లో తుది నిర్ణయం

రాజీనామాపై పవార్ ప్రకటన

ముంబై: పార్టీ భవిష్యత్ కోసమే అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకోవాలని తాను నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ గురువారం స్పష్టంచేశారు. పార్టీకి కొత్త నాయకత్వాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ముంబైలోని వైబీ చవాన్ భవన్ వెలుపల తన మద్దతుదారులను ఉద్దేశించి శరద్ పవార్ మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడిగా కొనసాగాలని ఎన్‌సీపీ మద్దతుదారులు డిమాండ్ చేశారు. రాజీనామాపై రానున్న రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకుంటానని కార్యకర్తలకు నచ్చచెప్పారు. పార్టీ కార్యకర్తల మనోభావాలను విస్మరించబోనని హామీ ఇచ్చారు. 'మీ మనోభావాలను గౌరవిస్తాను. నా ప్రణాళికల గురించి మీ అందరితో కచ్చితంగా చర్చిస్తా. ముమ్మలను విశ్వాసంలోకి తీసుకుంటాను. అయితే, పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకుంటానంటే మీరు మాత్రం అంగీకరించబోరని నాకు తెలుసు' అని పవార్ అన్నారు. రాజీనామాపై చర్చించడానికి ఇతర రాష్ట్రాలకు చెందిన పార్టీ నాయకులు శుక్రవారం తనను కలుస్తారని పవార్ చెప్పారు. ఒకటి, రెండు రోజుల్లో తుది నిర్ణయం తీసుకుంటానన్నారు. తన రాజీనామాతో ఉద్వేగానికి గురవుతున్న తన మద్దతుదారులను బుజ్జగించడానికి పవార్ ప్రయత్నించారు. ఎన్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో వైబీ చవాన్ భవన్ వద్దకు చేరుకున్నారు. 'మీరు పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను నియమించండి' అని పవార్‌కు మద్దతుదారులు సూచించారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగే 2024 వరకైనా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగాలని పవార్‌కు కొంతమంది అభిమానులు, మద్దతుదారులు విజ్ఞప్తి చేశారు. కొంతమంది అయితే...పవార్ తన నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే ఆమరణ దీక్ష చేస్తామని బెదిరించారు. పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం పవార్ అకస్మాత్తుగా సంచలన ప్రకటన చేశారు. ఎన్‌సీపీ ఆవిర్భావం 1999 నుంచి పవార్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించిన అమర్త్యా సేన్

కోల్‌కతా: శాంతినికేతన్‌లో ఆక్రమించిన స్థలాన్ని ఖాళీ చేయాలని అమర్త్యా సేన్‌కు విశ్వభారతి యూనివర్సిటీ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి అమర్త్యా సేన్ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. ఆ ఖాళీ స్థలాన్ని సేన్ అక్రమంగా ఆక్రమించారని, ఒకవేళ మే 6వ తేదీ అక్కడ నుంచి ఆయన వెళ్లకుంటే, తామే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని విశ్వభారతి యూనివర్సిటీ తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ కేసును జస్టిస్ బిబాస్ రంజన్ దే నేతృత్వంలోని ధర్మాసనం విచారించనున్నది. తన తండ్రి అశుతోష్ సేన్‌కు 1943 అక్టోబర్‌లో విశ్వభారతి వర్సిటీ 1.38 ఎకరాల భూమిని 99 ఏళ్లకు లీజు ఇచ్చిందని, ఆ భూమిలోనే ప్రతీచి భవనాన్ని కట్టినట్లు అమర్త్యా సేన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆదేశాలను వ్యతిరేకిస్తూ సేన్‌కు మద్దతుగా ఆయన ఇంటి ముందు ధర్నా చేపట్టాలని మంత్రులను సీఎం మమతా బెనర్జీ కోరారు. మరో వైపు తాము ఆ భవనాన్ని కూల్చడం లేదని విశ్వభారతి అధికారి ఒకరు తెలిపారు. వర్సిటీ ఆదేశాలపై గురువారం కోర్టు తాత్కాలిక స్టే ఇచ్చింది.

ద్రవిడుల తరహా పాలన ఆదర్శం

గవర్నరు వ్యాఖ్యలపై స్టాలిన్ ఆగ్రహం

చెన్నై: అన్ని రాష్ట్రాల్లోనూ ద్రవిడుల తరహా పాలన నడుస్తోందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పష్టంచేశారు. ద్రవిడ తరహా పాలనపై గవర్నరు ఆర్‌ఎన్ రవి పదేపదే విమర్శలు చేయడంపై స్టాలిన్ మండిపడ్డారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఇదే తరహా పాలనను అనుసరిస్తున్నాయని తెలిపారు. గవర్నరు విమర్శలపై తమ పార్టీ మిత్రపక్షాలు సైతం మండిపడుతున్న విషయాన్ని స్టాలిన్ గుర్తుచేశారు. ద్రవిడుల తరహా పాలన విజయవంతానికి రెండేళ్ల డీఎంకే పాలనే సాక్షీభూతమని వ్యాఖ్యానించారు. ద్రవిడుల తరహా పాలన అనేది కేవలం రాజకీయ నినాదం మాత్రమేనని, అది కాలం చెల్లిన సిద్ధాంతమని గవర్నరు వ్యాఖ్యానించినట్లు ఓ వర్గం మీడియాలో వచ్చిన వార్తలపై స్టాలిన్ ఘాటుగా స్పందించారు. రెండేళ్ల డీఎంకే పాలనలో ప్రజానుకూల కార్యక్రమాలు చేపట్టామని, తమిళనాడును సంక్షేమ రాష్ట్రంగా మార్చేశామని స్టాలిన్ చెప్పారు. ఐదేళ్ల పూర్తి పదవీకాలంలో ఈ విజయాన్ని కొనసాగిస్తామన్నారు. దీని ఆధారంగానే రానున్న ఎన్నికల్లో ప్రజలకు తమకు పట్టం కడతారని చెప్పారు. తమిళనాట గవర్నరు, డీఎంకే ప్రభుత్వం మధ్య సుదీర్ఘకాలంగా వైరం నడుస్తోంది. రాష్ట్ర బిల్లులు సహా అనేక సమస్యలపై ఘర్షణ కొనసాగుతోంది. పదేళ్ల చీకటి పాలనకు తెర దించుతూ రాష్ట్రంలో పాలనకు తమిళనాడు ప్రజలు తమకు నిర్ణయాత్మక తీర్పు ఇచ్చారని, 2021 మే 7న డీఎంకే అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాలతో పాటు అనేక ప్రాజెక్టులను ద్రవిడుల తరహా పాలనతోనే అమలు చేస్తున్నామని స్టాలిన్ వివరించారు. ఈ మేరకు స్టాలిన్ గురువారం పార్టీ కార్యకర్తలకు బహిరంగ లేఖ రాశారు. డీఎంకే ప్రభుత్వం సాధించిన విజయాలను కళ్లారా చూడలేని కొంతమంది తమ పాలనపై నిరాధార ఆరోపణలు చేస్తారని స్టాలిన్ విమర్శించారు.

ది కేరళ స్టోరీకి సీబీఎఫ్‌సీ సర్టిఫికేట్ జారీపై

విచారణకు సుప్రీం తిరస్కృతి

అత్యవసర విచారణ జరిపేలా కేరళ హైకోర్టుకు ఆదేశాలిచ్చేందుకూ కోర్టు నిరాకరణ

న్యూఢిల్లీ: వివాదాస్పద 'ది కేరళ స్టోరీ' చిత్రం శుక్రవారం విడుదల కానున్న క్రమంలో దీనికి లభించిన సీబీఎఫ్‌సీ అనుమతులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. ఈ కేసు విచారణకు తిరస్కరించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ఇప్పటికే ఈ చిత్రానికి సర్టిఫికేట్ ఇచ్చేసింది. చిత్రాలపై స్టే విధించే ముందు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. నటులు, నిర్మాతుల గురించి ఆలోచించాలి. వారు ఎంతో కష్టపడి చిత్రాలను తెరకెక్కిస్తారు. ఈ చిత్రం బాగుందో లేదో మార్కెట్ నిర్ణయిస్తుంది. అది మా పని కాదు' అని సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టంచేసింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మదీ వాదనలు వినిపించారు. 'కేరళ హైకోర్టు ఆపద్ధర్మ ప్రధాన న్యాయమూర్తి ఈ కేసు విచారణ కోసం ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు కానీ ఆ బెంచీ ప్రస్తుతం అందుబాటులో లేదని న్యాయస్థానానికి తెలిపారు. మీరు అత్యవసర విచారణ కోసం హైకోర్టును ఆశ్రయించవచ్చని చెప్పారు. హైకోర్టు ఇందుకోసం ఓ బెంచీని నియమించింది. కానీ వారు శుక్రవారం విచారణ జరిపిస్తామన్నారు' అని న్యాయవాది వాదించారు. తక్షణమే ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని కేరళ హైకోర్టుకు ఆదేశాలివ్వలేమని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. కాగా, బుధవారం కూడా ఈ సినిమాకు సంబంధించిన పిటిషన్‌లను సుప్రీంకోర్టు తిరస్కరించింది.

ఈపీఎఫ్ కీలక నిర్ణయం

యజమాన్యం వాటా నుంచే 1.16% అదనపు చెల్లింపు

న్యూఢిల్లీ: ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్-95) కింద అధిక పింఛనుకు ఆప్షన్ ఇచ్చిన ఉద్యోగులు రూ.15 వేలకు మించిన వేతనంపై 1.16శాతం అదనంగా చెల్లించాలన్న నిబంధనపై ఈపీఎఫ్‌ఓ వెనక్కి తగ్గింది. ఈ మొత్తాన్ని యజమాని వాటా నుంచే సమీకరించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు కార్మిక మంత్రిత్వ శాఖ బుధవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. "ఉద్యోగుల భవిష్య నిధికి యజమానుల ఇచ్చే వాటా మొత్తం 12 శాతంలోనే ఈ 1.16 శాతం అదనపు చెల్లింపును ఉద్యోగుల పింఛను పథకానికి తీసుకుంటాం" అని కార్మిక శాఖ వెల్లడించింది. అంటే అధిక పింఛను కోసం ఆప్షన్లు ఇచ్చిన ఉద్యోగులు రూ.15 వేలకు మించిన వేతనంపై ఇక 1.16 శాతం చొప్పున చెల్లించాల్సిన అవసరం లేదు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిబంధనను సవరించినట్లు కార్మిక శాఖ తెలిపింది. ఈ మేరకు మే 3 తేదీతో రెండు నోటిఫికేషన్లు విడుదల చేసింది. పింఛను నిధి పథకానికి ఈపీఎఫ్‌వో 2014 సెప్టెంబరు 1న సవరణలు చేసింది. అంతకుముందు అధిక వేతనంపై అధిక పింఛను కోసం యజమానితో కలిసి పేరా 11 (3)కింద ఉమ్మడి ఆప్షన్ ఇచ్చిన ఉద్యోగులంతా.. సవరణ తర్వాత పేరా 11 (4) కింద ఆరునెలల్లోగా మరోసారి ఆప్షన్ ఇవ్వాలని సూచించింది. లేదంటే ఆ ఉద్యోగి అధిక పింఛను ఆప్షన్‌ను వదులుకున్నట్లుగా భావిస్తారు. దీంతో పాటు 11 (4) కింద ఆరునెలల్లోగా అధిక పింఛను కోసం ఆప్షన్ ఇచ్చిన ఉద్యోగులు రూ.15 వేలకు మించి అదనపు వేతనంపై 1.16శాతం చొప్పున తన వంతు వాటాగా ఇవ్వాలని ఈపీఎఫ్‌ఓ షరతు పెట్టింది. దీనిపై అభ్యంతరాలు రావడంతో పాటు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఉద్యోగుల వేతనం నుంచి అదనంగా తీసుకోవడం సామాజిక భద్రత నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది. పింఛను నిధికి అదనపు చెల్లింపుల నిర్ణయాన్ని ఆరు నెలలపాటు నిలిపివేస్తున్నట్లు గతేడాది నవంబరులో ఉత్తర్వులిచ్చింది. ఆ లోగా ఇతర మార్గాల ద్వారా ఆ మేరకు నిధులను సమీకరించే ప్రయత్నాలను పరిశీలించాలని సూచించింది. ఈ క్రమంలోనే ఈపీఎఫ్‌వో తాజాగా నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఉద్యోగుల భవిష్యనిధికి యజమానుల వాటా కింద జమ అయ్యే 12 శాతంలో 8.33 శాతం ఈపీఎస్ లోకి వెళ్తుంది. మిగతా 3.67 శాతం ఉద్యోగి ఈపీఎఫ్ ఖాతాలో జమ చేస్తారు. తాజా నిర్ణయంతో 1.16 శాతం అదనపు చెల్లింపు కూడా యజమాని అందించే ఈ 12 శాతంలోనే ఉంది. దీంతో యజమాని నుంచి ఈపీఎస్ కింద వసూలు చేసే 8.33 శాతం వాటా పెరిగి 9.49 శాతానికి పెరగనుంది.

పవార్ నిర్ణయంతో ఎంవీఏ కూటమిపై ప్రభావం ఉండదు: ఠాక్రే

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలన్న శరద్ పవార్ నిర్ణయం మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) కూటమికి భంగం కలిగించదని మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. ముంబైలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఎన్సీపీలో పరిణామాల వల్ల ఎంవీఏ కూటమికి నష్టం కలిగించేలా ఎటువంటి ప్రభావం ఉండబోదని ఆయన అన్నారు. ప్రతిపక్షాల ఐక్యతను దెబ్బతీసే పని చేయనని అన్నారు. అయితే తాను ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకం కాదని, నియంతృత్వానికి వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. కాగా ఎన్సీపీ అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలని పవార్ తీసుకున్న నిర్ణయంపై స్పందించేందుకు మాత్రం ఆయన నిరాకరించారు. ఎన్సీపీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తూ శరద్‌పవార్ మంగళవారం అనూహ్య నిర్ణయం తీసుకోవడంతో ఆ పార్టీ శ్రేణులు షాక్‌కు గురయ్యాయి. కొందరు రాజీనామాలు చేస్తామని హెచ్చరించగా, మరికొందరు నిరాహారదీక్షలకు దిగుతామని ప్రకటనలు చేసినప్పటికీ పవార్ తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోలేదు. పార్టీలో క్రియాశీలకంగా ఉంటానని, అధ్యక్ష పదవికి మాత్రమే రాజీనామా చేశానని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ముంబైలో శుక్రవారం జరిగే పార్టీ కీలక సమావేశంలో తదుపరి అధ్యక్షుడెవరన్న దానిపై స్పష్టత రానుంది. ఎంవీఏలో శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే), ఎన్సీపీ, కాంగ్రెస్ భాగస్వామ పార్టీలు. నవంబర్ 2019 నుంచి జూన్ 2022 వరకు ఈ కూటమి నేతృత్వంలోని ప్రభుత్వం మహారాష్ట్రను పాలించింది.

రూ.3కోట్లకు మైన్మార్ పోర్టును అమ్మేసిన ఏపీఎస్ఈజెడ్

న్యూఢిల్లీ: మైన్మార్ పోర్టును 30 మిలియన్ డాలర్ల అంటే సుమారు రూ.3కోట్లకు అమ్మేసినట్లు అదానీ పోర్ట్స్, ప్రత్యేక ఆర్థిక జోన్ లిమిటెడ్ (ఏపీఎస్ఈజెడ్) గురువారం ప్రకటించింది. ఈ పోర్టుకు సంబంధించిన వాటా కొనుగోలు ఒప్పందం (ఎస్‌పీఏ)పై సంతకాలు జరిగినట్లు 2022, మేలో ఏపీఎస్ఈజెడ్ ప్రకటించింది. విక్రయ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రాజెక్టు, సంబంధిత అనుమతులతో కండీషన్ ప్రెసిడెంట్స్ (సీపీలు) ఉన్నాయి. కొన్ని సీపీలు పెండింగ్‌లో ఉండటం, ఈ ప్రక్రియలో సవాళ్లు ఎదురు కావడం, అనుమతుల జారీలో జాప్యం కొనసాగటంతో యథావిధి స్థితిలో పోర్టును విక్రయించాలన్న నిర్ణయం జరిగింది. ఇందుకోసం 'యాజ్ ఈజ్ వేర్ ఈజ్' క్లాజు ఆధారంగా విలువను నిర్ధారించినట్లు ఏపీఎస్ఈజెడ్ వెల్లడించింది. ఈ క్రమంలో అమ్మేవారికి, కొనేవారికి మధ్య మరోమారు చర్చలు జరిగాయని, 30 మిలియన్ డాలర్లకు బేరం కుదిరింది. విక్రయ ప్రక్రియ పూర్తి అయిన మూడ్రోజుల్లో పూర్తి మొత్తాన్ని కొనుగోలుదారు చెల్లిస్తారని, ఆపై వాటా బదిలీ జరుగుతుందని ఏపీసెఈజెడ్ ప్రకటన పేర్కొంది. 2021, అక్టోబరులో రిస్క్ కమిటీ చేసిన సిఫార్సుల ఆధారంగా ఏపీఎస్ఈజెడ్ బోర్డు కల్పించిన మార్గదర్శకాలకు అనుగుణంగా విక్రయం జరిగినట్లు ఏపీఎస్ఈజెడ్ సీఈవో, డైరెక్టర్ కరణ్ అద్వానీ వెల్లడించారు. మైన్మార్‌లో ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చిన ఆర్మీచీఫ్, సీనియర్ జనరల్ మిన్ ఆంగ్ హ్లాయింగ్‌తో 2019 జులైలో అద్వానీ భేటీ క్రమంలో ఈ ప్రాజెక్టు వివాదాస్పదంగా మారింది.

అయితే తాము పోర్టులో పెట్టిన పెట్టుబడులు అమెరికా ట్రెజరీ విభాగం, విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం (ఓఎఫ్ఏసీ) మార్గదర్శకాలకు కట్టుబడి ఉన్నట్లు 2021, ఆగస్టులో ఏపీఎస్ఈజెడ్ వెల్లడించింది. కాగా, భారత్‌లోని అతిపెద్ద పోర్ట్ డెవలపర్‌గా అదానీ గ్రూపుకు చెందిన ఏపీసెఈజెడ్ ఉన్నది.

కామాంధుడికి క్షమాభిక్ష నిరాకరించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన వ్యక్తికి క్షమాభిక్షను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిరాకరించారు. 2008 నాటి కేసులో దోషి వసంత సంపత్ దుపారే క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించారు. ఈ మేరకు రాష్ట్రపతిభవన్ కార్యాలయం గురువారం వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 28న దుపారే క్షమాభిక్ష పిటిషన్‌ను కేంద్ర హోంశాఖ, రాష్ట్రపతి సెక్రటేరియట్‌కు సిఫార్సు చేసింది. ఈ పిటిషన్‌ను ఏప్రిల్ 10నే ముర్ము తిరస్కరించినట్లు సెక్రటేరియట్ తెలిపింది.

కేసు వివరాలు: నాలుగేళ్ల బాలికపై వసంత దుపారే (అప్పటికి అతని వయసు 46 ఏళ్లు) హత్యాచారానికి ఒడిగట్టాడు. పక్కింటిలో ఉండేవారి పాపను తినుబండారాల ఆశ చూపించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బండరాళ్లతో మోది హత్య చేశాడు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు కాగా పోలీసులు దుపారేను అరెస్టు చేశారు. అనంతరం అతడిని కోర్టు మరణశిక్ష విధించింది. ఆ శిక్షను బాంబే హైకోర్టు సమర్థించింది. ఈ తీర్పుపై 2014లో దుపారే సుప్రీం కోర్టును ఆశ్రయించగా అతడి మరణశిక్షను అత్యున్నత న్యాయస్థానం కూడా సమర్థించింది. దుపారే రివ్యూ పిటిషన్‌ను 2017లో సుప్రీం కోర్టు కొట్టివేసింది. అతడి మరణశిక్షను మరో సారి సమర్థించింది. దీంతో అతడు క్షమాభిక్ష కోరగా తాజాగా రాష్ట్రపతి తిరస్కరించారు.

కార్పొరేట్ కనుసన్నల్లో మోదీ

సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర- మల్కాజిగిరి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కనుసన్నల్లో పని చేస్తూ పాలనను దిగజారుస్తూ ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టరు కె.నారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఐ పాదయాత్రలో భాగంగా గురువారం ఆనందబాగ్ చౌరస్తాలో జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన సార్వభౌమత్వ విధ్వం సానికి మోదీ ప్రభుత్వం పాల్పడు తోందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో ఉన్న ఐదు ప్రభుత్వరంగ సంస్థలనునా తరువాత 400కు విస్తరించుకొని స్వావలంబన దిశగా అడుగులు వేస్తే మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. దేశంలో లాభాలతో నడిచే బ్యాంకులు, బీమా కంపెనీలు, ఉక్కు, బొగ్గు, రైల్వే, విమానయానం, చమురు కంపెనీలు, నౌకాశ్రయం, ఆఖరుకు రక్షణ రంగంతో పాటు అన్ని రంగాలను ప్రైవేటీకరించేలా చట్టాలు చేశారని విమర్శించారు, ప్రమాదకర పాసిస్టు విధానాలను, నిరంకుశ హిట్లర్ తరహా పాలనను అందిస్తున్న నరేంద్ర మోదీ ప్రభు త్వాన్ని 2024 ఎన్నికల్లో ఓడించి వామపక్ష, ప్రగతిశీల, లౌకిక ప్రజాస్వామిక శక్తులతో కూడిన ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవడానికి కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తుందని నారాయణ తెలిపారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేశ్ ప్రసంగిస్తూ టీఆర్ఎస్ ప్రభుతం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు పర్చడం లేదన్నారు. పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే రెవెన్యూ, పోలీసు అధికారులు హుటాహుటిన తొలగిస్తున్నారని విమర్శించారు. ఈ సభలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్ దశరథ్, రొయ్యల కృష్ణమూర్తి, రచ్చ కిషన్, మల్కాజ్గిరి మండల కార్యదర్శి టీ.యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'గో ఫస్ట్' దివాలా పిటిషన్‌పై తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న తర్వాత స్వచ్ఛంద దివాలా పరిష్కార ప్రక్రియను కోరుతూ 'గో ఫస్ట్' విమానయాన సంస్థ వేసిన పిటిషన్‌పై తీర్పును నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) రిజర్వు చేసింది. దివాలా పరిష్కార ప్రక్రియ, దాని ఆర్థిక బాధ్యతలపై మధ్యంతర మారటోరియం విధించాలన్న గోఫస్ట్ పిటిషన్‌పై జస్టిస్ రామలింగం సుధాకర్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణను ముగించింది. అయితే, విమాన లీజుదారులు ఎయిర్ గో అభ్యర్థనను వ్యతిరేకించారు. తమ వాదనను వినకుండా దివాలా ప్రక్రియను ప్రారంభించరాదని చెప్పారు. గో ఫస్ట్ తరపున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ మాట్లాడుతూ... ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ కోడ్ (ఐబిసి) లక్ష్యం... సంక్షోభ స్థితిని ఎదుర్కొంటున్న ఓ కంపెనీని పూర్తిగా దెబ్బతినకుండా చూసుకోవడమేనని అన్నారు. కాగా నిర్వహణ కారణాల వల్ల నగదు కొరతతో గో ఫస్ట్ మే 9 వరకు విమానాలను రద్దు చేసింది. విమానయాన సంస్థ టిక్కెట్ల విక్రయాన్ని మే 15 వరకు నిలిపివేసిందని, భవిష్యత్ తేదీల కోసం ఇప్పటికే ఉన్న బుకింగ్‌లను రీఫండ్ చేయడానికి లేదా రీషెడ్యూల్ చేయడానికి కృషి చేస్తోందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తెలిపింది. 'రీఫండ్‌ల మొత్తం విలువ ఇంకా రాలేదు. గత 30 రోజుల్లో సర్వీసుల రద్దు కారణంగా 77,000 మంది ప్రయాణికులు ప్రభావితమయ్యారు' అని గో ఫస్ట్ సీఈఓ కౌశిక్ ఖోనా ది హిందూతో అన్నారు. మే 3 నుంచి మూడు రోజుల పాటు విమానాలను రద్దు చేయాలని అకస్మాత్తుగా నిర్ణయించిన తరువాత డీజీసీఏ ఎయిర్‌లైన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే తమ షెడ్యూల్ కార్యకలాపాలను నిలిపివేయాలని గో ఫస్ట్ తీసుకున్న ఆకస్మిక నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల అసౌకర్యాన్ని తగ్గించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. కాగా ఇంజిన్ సరఫరాదారు కారణంగా దివాలా కోర్టును ఆశ్రయించినట్లు విచారణ సందర్భంగా గో ఫస్ట్ తెలిపింది. విమానయాన సంస్థను పునరుద్ధరించడానికి అవకాశం ఉందని, మధ్యంతర మారటోరియం మంజూరు చేయాలని అభ్యర్థించింది. సంస్థ కూడా ఆర్థిక సంక్షోభంలో ఉందని అంగీకరించింది.

మోదీ, జగన్ ప్రభుత్వాలపై ఐక్య ఉద్యమాలు

రావుల వెంకయ్య, బృందా కారత్ పిలుపు

విశాలాంధ్ర-చింతూరు (అల్లూరి జిల్లా): మోదీ, జగన్ ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు అవశ్యమని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు రావుల వెంకయ్య, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ ఉద్ఘాటించారు. సీపీఐ, సీపీఎం ప్రచారభేరిలో భాగంగా గురువారం చింతూరులో ముగింపు సభ జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి కిరణ్ అధ్యక్షత వహించారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ మోదీ 9 ఏళ్ల పాలనలో సామాన్యుల జీవితాలు ఛిద్రమయ్యాయని విమర్శించారు. అంబానీ, అదానీ అడుగులకు మడుగులొత్తుతూ వేలకోట్ల రూపాయలు దోచిపోడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటుపరం చేయడమే లక్ష్యంగా మోదీ సర్కారు పనిచేస్తోందని రావుల వెంకయ్య చెప్పారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆగ్రహం వెలిబుచ్చారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం కార్మికులతో పాటు సీపీఐ, సీపీఎం అలుపెరగని పోరాటం చేస్తున్నాయని చెప్పారు. పెద్దనోట్ల రద్దుతో సామాన్యులను రోడ్డున పడేసిన మోదీ సర్కారు...విదేశాల్లో మూలుగుతున్న నల్లడబ్బును తీసుకురావడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఒకేదేశం-ఒకే పన్ను పేరుతో జీఎస్‌టీ తీసుకొచ్చి ప్రజలపై మోయలేని భారం మోపుతోందన్నారు. మోదీ విధానాలతో సంపన్నుడు మరింత సంపన్నుడుగా, పేదవాడు మరింత పేదవాడిగా మారుతున్నారని తెలిపారు. దిల్లీలో రైతులు సాగించిన ఉద్యమం స్ఫూర్తితో మోదీ సర్కారుపై పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని రావుల వెంకయ్య చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్కరణలను దేశమంతా వ్యతిరేకించినా జగన్ ప్రభుత్వం మాత్రం నిస్సిగ్గుగా అమలు చేస్తోందని మండిపడ్డారు. మోటార్లకు మీటర్లు బిగిస్తూ రైతుల తలకు ఉరితాడు బిగిస్తోందని చెప్పారు. పోలవరం నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

బృందాకారత్ మాట్లాడుతూ చట్టాలకు తూట్లు పొడుస్తున్న పాలకులను గద్దె దించాలని పిలుపునిచ్చారు. మోదీ సర్కార్ దేశ సంపదన దోపిడీదారులకు కట్టబెడుతోందని విమర్శించారు. అదానీ రెండేళ్లలో అత్యంత ధనవంతుడు ఎలా అయ్యాడని ప్రశ్నించారు. దేశంలో 90 శాతం మంది రోజు కూలీ వారేనని, ఏ పని చేసినా నెలకు పదివేల రూపాయలు సంపాదించడం గగనమన్నారు. మోడీ కళ్లకు పేదలు కనిపించడం లేదన్నారు. ప్రజల దృష్టి మళ్లించడానికే మన్‌కీ బాత్ అంటూ ప్రధాని మోదీ నాటకాలాడుతున్నారని ఆరోపించారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే జన్‌కీ బాత్ జరపాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు వల్ల నాలుగు మండలాల గిరిజనులు అవస్థలకు గురవుతున్నారన్నారు. పునరావాసం కల్పించకుండానే ప్రాజెక్టు నిర్మాణం ఎలా చేపడతారని నిలదీశారు. 2013లో వచ్చిన భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు సాయమందించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు అండగా ఎర్ర జెండా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఆదివాసీలకు అటవీ ఉత్పత్తులపై హక్కులు ఉన్నాయని, అయినా అడవి నుంచి కట్టెలు సైతం తెచ్చుకోవడానికి ప్రభుత్వం అనుమతించడం లేదని మండిపడ్డారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, సీపీఐ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, సీపీఐ నాయకులు కందుకూరి స్వర్ణ, గుజ్జా మోహన్ రావు, ఎస్‌కే రంజాన్, నాగరాజు, కంటే రాజు, విష్ణు, చిమడయ్య, సీపీఎం నాయకులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, కుంజా సీతారామయ్య, మర్లపాటి నాగేశ్వరరావు, లోత రామారావు, మట్ల వాణిశ్రీ, పునెం సత్యనారాయణ, కారం లక్ష్మి, సేసం సురేశ్, మేకల నాగేశ్వరరావు, పల్లపు వెంకట్, ఐ.వెంకటేశ్వర్లు, ఎర్రంశెట్టి శ్రీనివాస్, సోయం చిన్నబాబు, కొమరం పెంటయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బీహార్‌లో కుల గణన నిలిపివేత

- 'స్టే' విధించిన పాట్నా హైకోర్టు
- జులై 7న తదుపరి విచారణ

పాట్నా: పాట్నా: బీహార్‌లో కుల ఆధారిత సర్వేను నిలిపివేస్తూ పాట్నా హైకోర్టు గురువారం స్టే విధించింది. బీహార్‌లో కులాల గణన, ఆర్థిక సర్వేపై మధ్యంతర స్టే విధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం కోర్టు తన తీర్పును రిజర్వు చేసింది. అఖిలేశ్‌కుమార్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను బుధవారం ప్రధాన న్యాయమూర్తి కేవీ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరపున న్యాయవాదులు దినుకుమార్, రీతూరాజ్, అభినవ్ శ్రీవాస్తవ వాదనలు వినిపించారు. కోర్టులో రాష్ట్రం తరపున అడ్వకేట్ జనరల్ పీకే షాహి వాదించారు. వివిధ పిటిషన్లను విచారించిన ధర్మాసనం... కుల ఆధారిత సర్వేను వెంటనే నిలిపివేయాలని, ఇప్పటికే సేకరించిన డేటాను భద్రంగా ఉంచుతూ తుది ఉత్తర్వులు వెలువడే వరకు ఎవరితోనూ పంచుకోవద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జులై7కి వాయిదా వేసింది. 'బీహార్ రాష్ట్రం ప్రయత్నించినట్లుగా, కుల ఆధారిత సర్వే ప్రక్రియ కొనసాగింపునకు వ్యతిరేకంగా పిటిషనర్లు ప్రాథమికంగా కేసు పెట్టారని మేము భావిస్తున్నాము. డేటా సమగ్రత, భద్రతపై కూడా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిని రాష్ట్రం మరింత వివరంగా పరిష్కరించాల్సి ఉంది' అని కోర్టు పేర్కొంది. 'ప్రధానంగా, కుల ఆధారిత సర్వేను నిర్వహించే అధికారం రాష్ట్రానికి లేదని మేము అభిప్రాయ పడుతున్నాము... ఇప్పుడు రూపొందించబడిన పద్ధతిలో, ఇది జనాభా గణనకు సమానం... తద్వారా పార్లమెంట్ యూనియన్ శాసనాధికారంపై ప్రభావం చూపుతుంది' అని తెలిపింది. సర్వేలోని డేటాను రాష్ట్ర అసెంబ్లీలోని వివిధ పార్టీల నాయకులతో పంచుకోవాలనే ప్రభుత్వ ఉద్దేశాన్ని కోర్టు గుర్తించింది. అయితే 'గోప్యత హక్కుపై ప్రశ్న ఖచ్చితంగా తలెత్తుతుంది...ఇది జీవించే హక్కు అంశం' అని కోర్టు పేర్కొంది. తీర్పు అనంతరం బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ... పేదరికాన్ని నిర్మూలించాలని కోరుతున్నందున కులాల వారీగా జనాభా గణనను ప్రజల సంక్షేమం కోసం నిర్వహిస్తున్నామన్నారు. ఒక విషయం స్పష్టంగా ఉంది... అది ఖచ్చితంగా జరుగుతుందన్నారు. కాగా ఇంతకుముందు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ రాష్ట్రంలో తన ప్రభుత్వం నిర్వహిస్తున్న కులాల సర్వేపై కొన్ని వర్గాలు వ్యతిరేకించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజానికి కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని నితీశ్ సహా బిహార్ పక్షాలన్నీ చాలాసార్లు కోరాయి. అయితే దీనిపై కేంద్రం నుంచి సరైన సమాధానం రాకపోవడంతో నితీశ్ ప్రభుత్వమే బీహార్‌లో చేపట్టింది. జనవరి 7న అధికారికంగా ఈ గణన ప్రారంభమైంది. దీనికి ఒక్క బీజేపీ మినహా బీహార్‌లోని అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చాయి. 500 కోట్ల రూపాయల బడ్జెట్‌తో ప్రారంభించిన ఈ సర్వే రెండు భాగాలుగా సాగుతోంది. ఇప్పటికే ఒక సర్వే పూర్తైంది. మొదటి విడతలో జనవరి 7 నుంచి 21 తేదీ వరకు మధ్య కులాల సర్వే జరిగింది. ఇక రెండవ విడత సర్వే ఏప్రిల్ 15 నుంచి మే 15 వరకు నిర్వహించాలి. కానీ కొన్ని అభ్యంతరాలు, అడ్డంకుల నడుమ అది ఆగిపోయింది.

రాజధాని రైతుల పిటిషన్‌పై

9న సుప్రీం విచారణ



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కేసులపై సుప్రీంకోర్టులో జులై11న విచారణ జరగనున్నది. మృతిచెందిన పిటిషనర్ల స్థానంలో వేరొకరికి అవకాశం కల్పించాలని అనేక మంది రైతులు ఎల్ఆర్ దరఖాస్తులు సమర్పించారు. రైతులు దాఖలుచేసిన తాజా పిటిషన్‌పై ఈ నెల 9వ తేదీన సుప్రీంకోర్టులో విచారణ జరగనున్నది. జస్టిస్ జోసెఫ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరపనున్నది.

ఏపీ భవన్ విభజనపై కేంద్ర హోంశాఖ కీలక ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: దేశరాజధాని దిల్లీలోని ఏపీ భవన్ విభజనపై కేంద్ర హోంశాఖ కీలక ప్రతిపాదనలు చేసింది. ఏప్రిల్ 26న రెండు రాష్ట్రాల అధికారులతో కేంద్ర హోంశాఖ భేటీ అయింది. భేటీ వివరా లను రెండు రాష్ట్రాల అధికారులకు పంపింది. భూములు, భవనాల విభజనపై గతంలో ఆంధ్రప్రదేశ్ మూడు ప్రతిపాదనలు చేసింది. ఆస్తుల విభజనపై తాజాగా తెలంగాణ మరో ప్రతిపాదన చేసింది. గోదావరి, శబరి బ్లాకులు, నర్సింగ్ హాస్టల్ పక్కనే ఉన్న ఖాళీ స్థలం ఇవ్వాలని ప్రతిపాదించింది. కేంద్ర హోంశాఖ, తెలంగాణ ప్రతిపాదనకు పూర్తిగా భిన్నమైన ప్రతిపాదన చేసింది. 7.64 ఎకరాల పటౌడీ హౌస్‌ను తెలంగాణ తీసుకోవాలని, మిగిలిన 12.09 ఎకరాల ఖాళీ భూమి ఏపీ తీసుకోవాలని పేర్కొంది. ఆస్తులను 58:42 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణ పంచుకోవాలని కేంద్రం సూచించింది. ఏపీకి అదనపు భూమి దక్కితే తెలంగాణకు ఏపీ నుంచి భర్తీ చేసుకోవాలని తెలిపింది.

బంకర్‌లోకి పుతిన్

మాస్కో: రష్యా అధ్యక్ష కార్యాలయం, నివాసంపై డ్రోన్ల దాడి జరగడాన్ని రష్యా తీవ్రంగా పరిగణించింది. దీంతో అధ్యక్షుడి భద్రతా సిబ్బంది మరింత అప్రమత్తమైంది. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను బంకర్‌కి తరలించారు. ఆయన నోవో-ఒగరెవో ప్రాంతంలోని నివాసంలో ఈ బంకర్ ఉంది. అధ్యక్షుడు అక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తారని స్థానిక మీడియా వెల్లడించింది. అయితే క్రెమ్లిన్‌పై దాడి వెనుక అమెరికా హస్తం ఉన్నట్లు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ఆరోపించారు. దాడి చేసే ప్రాంతాలను అమెరికా ఎంపిక చేస్తే ఉక్రెయిన్ వాటిని ఆచరిస్తుందని వ్యాఖ్యానించారు. రష్యాకు అంతా తెలుసని ప్రతీకారం తీర్చుకోగలదని పెస్కోవ్ హెచ్చరించారు.

అమెరికా స్ప్రింటర్ టోరీ బౌవీ అనుమానాస్పద మృతి

న్యూయార్క్: అమెరికాకు చెందిన ప్రముఖ మహిళా స్ప్రింటర్ టోరీ బౌవీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. 2016 రియో ఒలింపిక్స్‌లో మూడు పతకాలు సాధించింది. టోరీ బౌవీ వయసు 32 ఏళ్లు. 4×100 మీటర్ల రిలే ఈవెంట్‌లో స్వర్ణ, 100 మీటర్ల రిలేలో సిల్వర్, 200 మీటర్ల రేస్‌లో ఆమె కాంస్య పతకం గెలుచుకున్నది. ఫ్లోరిడాలోని ఓర్లాండాలో ఉన్న ఇంట్లో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. ఐకాన్ మేనేజ్‌మెంట్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో టోరీ గురించి రాసింది. ఈ విషాధ వార్తను షేర్ చేసుకోవడం బాధాకరంగా ఉన్నట్లు ఆ సంస్థ చెప్పింది. ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ ఆకస్మికంగా చనిపోవడం షాకింగ్‌గా ఉందని ఐఓసీ ప్రెసిడెంట్ థామస్ బాచ్ తెలిపారు. అథ్లెట్ బౌవీ .. మిస్సిసిపీలో జన్మించింది. తొలుత ఆమె బ్లాస్కెట్‌బాల్ ఆడింది. అథ్లెటిక్ స్కాలర్‌షిప్ అందుకున్న తర్వాత ఆమె సక్సెస్‌ఫుల్ అథ్లెట్‌గా మారింది. ఆ తర్వాత ఇండోర్, ఔడోర్ టోర్నీల్లోనూ ఆమె మెరుగ్గా రాణించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.